**విలేకరులు కావలెను**

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వెలుబడుతున్న

ప్రజా స్వేచ్ఛ

PRAJA SWECHA

రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక

తెలుగు మాసపత్రిక నందు పనిచేయుటకు జర్నలిజంపై ఆసక్తి కలిగిన ప్రతి మండలం నుండి విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

+91 9381910611 , 7989289492



www.prajaswecha.com

# ప్రజా స్వేచ్ఛ


PRAJA SWECHA

రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక






| హైదరాబాద్ | సంచిక : 1 | సంపుటి : 208 | ఎడిటర్ : తరిగొప్పుల లక్ష్మి మహేందర్ ప్రజాపతి | జనవరి 2025 | వెల : రూ 10/- |
|---|---|---|---|---|---|


## దోషి సంజయ్ రాయ్‌కి జీవిత ఖైదు

- ట్రెయినీ వైద్యురాలిపై హత్యాచారం కేసు
- బాదితురాలి కుటుంబానికి 17 లక్షల పరిహారం
- కోల్‌కతాలోని సిల్దా కోర్టు సంచలన తీర్పు

కోల్‌కతా,

కోల్‌కతా ఆర్‌జీకర్ మెడికల్ కాలేజీలో ట్రెయినీ వైద్యురాలిపై హత్యాచారం కేసుకు సంబంధించి దోషి సంజయ్ రాయ్ కి కోల్‌కతాలోని సిల్దా కోర్టు జీవిత ఖైదు శిక్ష వేస్తూ తీర్పు నిచ్చింది. ఈ కేసులో ఇప్పటికే

-మిగతా 3 లో



## ఇందిరమ్మ ఇళ్ల కోసం మరో అవకాశం

- నేటి నుంచి గ్రామసభల్లో దరఖాస్తుల స్వీకరణ

హైదరాబాద్,

కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకునేందుకు మరో అవకాశం ఇవ్వాలని నిర్ణయించింది రాష్ట్ర ప్రభుత్వం. జనవరి 21 నుంచి జరిగే గ్రామ సభల్లో వీటి కోసం అప్లికేషన్లు స్వీకరించాలని కలెక్టర్లను

-మిగతా 3 లో



## రాహుల్ గాంధీకి ఊరట

- క్రిమినల్ కేసు విచారణను నిలిపివేసిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ,

కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి భారీ ఊరట లభించింది. కేంద్ర హెూం శాఖ మంత్రి అమిత్‌షా, బీజేపీపై చేసిన వ్యాఖ్యలకు గానూ దాఖలైన పరువు నష్టం కేసులో ఆయనపై క్రిమినల్ విచారణను సుప్రీంకోర్టు నిలిపివేసింది. 2018 లో బెంగళూరులో జరిగిన విలేకరుల సమావేశంలో కేంద్ర హెూం

-మిగతా 3 లో

## పెట్టుబడులు తేవడమే లక్ష్యంగా

### దావోస్ చేరుకున్న సీఎం రేవంత్ బృందం




- పెట్టుబడులు లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం
- గత ఏడాది రాష్ట్రానికి రూ.40 వేల కోట్ల పెట్టుబడులు
- ఈసారి అంతకు మించి పెట్టుబడులను తేవడమే లక్ష్యంగా అన్న సీఎం రేవంత్

హైదరాబాద్,

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బృందం దావోస్ చేరుకుంది. ఆయనవెంట ఐటిశ్శాఖ మంత్రి శ్రీధర్ బాబు, ఐటి సెక్రటరీ జయేశ్ రంజన్ ఇతర ప్రతినిధులు ఉన్నారు. సింగపూర్ పర్యటనను విజయవంతంగా

-మిగతా 3 లో




## చిన్మయ్ కృష్ణ దాస్‌కు మరోసారి నిరాశ

హైకోర్టులో విచారణకు రాని బెయిల్ పిటిషన్

ఢాకా,

బంగ్లాదేశ్ జాతీయ జెండాను అవమానించారంటూ 'దేశద్రోహం' ఆరోపణల కేసును ఎదుర్కొంటున్న 'బంగ్లాదేశ్ సమ్మిళిత్ సనాతని జాగరణ్ జోతె' ప్రతినిధి చిన్మయ్ కృష్ణ దాస్ కు మరోసారి నిరాశ ఎదురైంది. బెయిలు కోరుతూ ఆయన హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్

-మిగతా 3 లో



## కర్మభూమితో పాటు జన్మభూమికి పాటుపడండి

- ఐటి కోసం ఆనాడు పడ్డ కష్టానికి ఫలితం దక్కింది
- సత్య నాదెళ్ల లాంటి వారు మైక్రోసాఫ్ట్ సిఇవో కాగలిగారు
- కన్నవూరు కోసం పాటుపడేలా ముందుకు రండి
- మరో జన్మంటూ ఉంటే తెలుగువాడిగా పుడతా
- జ్యూరిచ్ పారిశ్రామికవేత్తల సదస్సులో చంద్రబాబు

జ్యూరిచ్,

కర్మభూమిని, జన్మభూమిని మరవ వద్దని ఎపి సిఎం చంద్రబాబు ప్రవాసాంధ్రులను కోరారు. తెలుగుజాతి అభివృద్ధికి పాటుపడాలని అన్నారు. ఉన్నచోట ఉంటూనే అక్కడి దేశ అభివృద్ధితో పాటు, కన్నభూమి అభివృద్ధికి కూడా తోడ్పడాలని అన్నారు. ఏ దేశమైనా యువత వల్లే అభివృద్ధి చెందుతుందని చంద్రబాబు అన్నారు. అందుకే రాజకీయాల్లోకి వచ్చేలా యువతను ప్రోత్సహించి నట్లు చెప్పారు. రాష్ట్రానికి పెట్టుబడులు సాధించడమే లక్ష్యంగా ప్రపంచ

-మిగతా 3 లో

## సఫాయి అన్నకు సలాం కొట్టిన ఒకే ఒక్కడు కేసీఆర్



- కేసీఆర్ పాలనలో హ్యాపీగా కార్మికులు
- మూడుసార్లు జీతాలు పెంచిన దేవుడు కేసీఆర్
- అంగన్‌వాడీల జీతం రూ. 4500 ఉంటే రూ. 13650కు పెంచాం
- మాజీ మంత్రి కేటీఆర్

హైదరాబాద్,

ఈ రాష్ట్రంలో పని చేసే కార్మికుల అభివృద్ధి కోసం నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఎంతో కృషి చేశారని బీఆర్ఎస్ వర్కింగ్

-మిగతా 3 లో

## అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ ప్రమాణం




### హాజరైన విదేశాంగ మంత్రి జైశంకర్...ముఖేశ్ అంబానీ

- ప్రమాణం చేయించిన సుప్రీం ప్రధాన న్యాయమూర్తి
- తొలుత ప్రమాణం చేసిన ఉపాధ్యక్షుడు జెడి వాన్స్

వాషింగ్టన్,

అమెరికా నూతన అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ ప్రమాణస్వీకారం చేశారు. వాషింగ్టన్‌లోని క్యాపిటల్ హిల్ రోటుండాలో అట్టహాసంగా జరిగిన ఈ కార్యక్రమానికి ప్రపంచ దేశాలకు చెందిన పలువురు అగ్రనేతలు, పారిశ్రామిక, టెక్ దిగ్గజాలు, అతిరథ మహారథులు హాజరయ్యారు. వీరందరి సమక్షంలో అగ్రరాజ్యం 47వ అధ్యక్షుడిగా ట్రంప్ ప్రమాణస్వీకారం చేశారు. గతేడాది నవంబర్‌లో జరిగిన ఎన్నికల్లో విజయం సాధించిన 78 ఏళ్ల ట్రంప్ చేత అమెరికా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జాన్ రాబర్ట్స్ ప్రమాణం చేయించారు.

-మిగతా 3 లో



# మళ్లీ తెలంగాణలో పడిపోతున్న ఉష్ణోగ్రతలు



**హైదరాబాద్,**
తెలంగాణ వ్యాప్తంగా చల్లని గాలులు వీస్తున్నాయి. పలు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు సింగిల్ డిజిట్‌కే పరిమితం అయ్యాయి. చలి విపరీతంగా ఉండడంతో ఆయా ప్రాంతాల ప్రజలు వణికిపోతున్నారు. వృద్ధులు, చిన్న పిల్లలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పలు ప్రాంతాల్లో పొగమంచు కూడా దట్టంగా కురుస్తోంది. దీంతో వాహనదారులు, రైతులు ఇబ్బందులు పడుతున్నారు వారం రోజుల తర్వాత సోమవారం ఉష్ణోగ్రతలు సింగిల్ డిజిట్‌కే పరిమితం అయ్యాయి. హైదరాబాద్ నగర శివార్లతో పాటు రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆదివారం సాయంత్రం నుంచి సోమవారం ఉదయం వరకు నగర శివార్లలోని మొయినాబాద్‌లో 9.4 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదు కాగా, కుమ్రం భీం ఆసిఫాబాద్, ఆదిలాబాద్, సంగారెడ్డి, నిర్మల్ జిల్లాల్లో పలు చోట్ల 6.5 డిగ్రీల నుంచి 9 డిగ్రీల సెల్సియస్ మధ్య ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. రాబోయే మూడు రోజుల పాటు పలు ప్రాంతాల్లో ఈ ఉష్ణోగ్రతలు కొనసాగే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. 5 నుంచి 10 డిగ్రీల సెల్సియస్ మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది. ఈ మూడు రోజుల్లో పొద్దున్నే పొగమంచు దట్టంగా కురిసే అవకాశం ఉందని, వాహనదారులు జాగ్రత్తలు పాటించాలని అధికారులు సూచించారు.

# అమెరికాలో హైదరాబాద్ యువకుడిపై కాల్పులు

### చైతన్యపురికి చెందిన యువకుడు మృతి



**హైదరాబాద్,**
అమెరికాలో హైదరాబాద్ యువకుడిపై దుండగులు కాల్పులకు పాల్పడ్డారు. ఈ ఘటనలో చైతన్యపురికి చెందిన రవితేజ మృతి చెందాడు. అతని మరణ వార్త విని కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. మాస్టర్స్ చదివేందుకు 2022లో రవితేజ అమెరికా వెళ్లినట్లు సమాచారం. దీనిపై ఇంకా వివరాలు తెలియాల్సి ఉంది.


# లోకేశ్‌కు డిప్యూటి సిఎం పదవి డిమాండ్

### ఈ అంశంపై ఇక మాట్లాడ వద్దంటూ టిటిపి ఆదేశం



**అమరావతి,**
ఏపీ మంత్రి నారా లోకేశ్‌ను డిప్యూటీ సీఎం చేయాలన్న డిమాండ్లు వినిపిస్తోన్న నేపథ్యంలో తెదేపా అధిష్ఠానం కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ అంశంపై ఎవరూ మాట్లాడవద్దని పార్టీ నేతలను ఆదేశించింది. ఎవరూ మీడియా వద్ద బహిరంగ ప్రకటనలు చేయవద్దని సూచించింది. ఏ నిర్ణయమైనా కూటమి నేతలు కూర్చొని మాట్లాడుకుంటారని స్పష్టం చేసింది. వ్యక్తిగత అభిప్రాయాలను పార్టీపై రుద్దవద్దని పేర్కొంది. ఇటీవల సీఎం చంద్రబాబు మైదుకూరు పర్యటనలో ఉన్నప్పుడు కడప జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. నారా లోకేశ్‌కు ఉపముఖ్యమంత్రి పదవి ఇవ్వాలని తన అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. ఆ తర్వాత పలువురు నేతలు ఇదే అంశంపై బహిరంగంగా మాట్లాడారు. పార్టీతో సంబంధం లేకపోయినప్పటికీ.. ఎవరి వ్యక్తిగత అభిప్రాయాలను వారు చెబుతున్నారు. మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ, రాజమండ్రి అర్బన్ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు కూడా నారా లోకేశ్‌ను డిప్యూటీ సీఎంను చేయాలని బహిరంగంగా వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో ఎవరి వ్యక్తిగత అభిప్రాయాలు వారు చెప్పడం సరికాదని పార్టీ అధిష్ఠానం భావించింది. ఇలాంటి సున్నితమైన అంశాలపై కూటమి నేతలు చర్చించి నిర్ణయం తీసుకుంటారని స్పష్టత ఇచ్చింది. ఈ నేపథ్యంలో ఈ అంశంపై ఎవరూ మాట్లాడవద్దని పార్టీ నేతలకు ఆదేశాలు జారీ చేసింది.


# ప్రియుడిని చంపిన ప్రియురాలికి ఉరిశిక్ష



**రువనంతపురం,**
కేరళ రాజధాని తిరువనంతపురం కోర్టు మరో కీలక తీర్పు వెల్లడించింది. ప్రియుడిని చంపిన కేసులో ప్రియురాలికి ఉరిశిక్ష విధిస్తూ సంచలన తీర్పు ఇచ్చింది. 2022లో కేరళలో విషం కలిపిన కూల్‌డ్రింక్ ఇచ్చి ప్రియుడు శరోన్ రాజ్‌ను ప్రియురాలు గ్రీష్మ చంపిన ఘటన సంచలన సృష్టించింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. పూర్తి ఆధారాలు సేకరించి కోర్టుకు సమర్పించారు. ఆధారాలను పరిశీలించిన తిరవనంతపురం కోర్టు.. గ్రీష్మకు ఉరిశిక్ష విధిస్తూ కోర్టు వెలువరించింది. అంతేకాదు.. శరోన్ రాజ్ ను చంపేందుకు గ్రీష్మకు సహకరించిన బంధువుకు మూడేళ్ల జైలు శిక్ష విధించింది. కేరళలో బాయ్‌ఫ్రెండ్‌ను 2022లో చంపిన గ్రీష్మ అనే యువతికి స్థానిక నెయ్యట్టింకర అదనపు జిల్లా సెషన్స్ కోర్టు మరణ శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించింది. ఈ కేసులో మూడవ నిందితుడు, ఆమెకు సహకరించిన ఆమె మేనమామ నిర్మలకుమారన్ నాయర్‌కు కోర్టు మూడు సంవత్సరాల కారాగార శిక్ష విధించింది. విద్యాపరమైన తన విజయాలు, గత నేర చరిత్ర లేకపోవడం, తన తల్లిదండ్రులకు ఏకైక కుమార్తెను కావడం వంటి కారణాలను పేర్కొని తనకు శిక్ష విధించడంలో కనికరం చూపాలని 24 ఏళ్ల దోషి కోర్టును అభ్యర్థించింది. అయితే, ఆమె క్రూర నేరానికి పాల్పడి, సాక్షాలను చెరిపివేసి, దర్యాప్తును తప్పుదోవ పట్టించిందని, ఆమె వయస్సును పరిగణనలోకి తీసుకోలేమని కోర్టు తన 586 పేజీల తీర్పులో స్పష్టం చేసినట్లు ప్రాసిక్యూటర్ వెల్లడించారు. తనతో రిలేషన్‌షిప్ ముగించేందుకు శరణ్ రాజ్ (23) ఒప్పుకోలేదని పెస్టిసైడ్ కలిపిన డ్రింక్ తాగించి అతనిని గ్రీష్మ చంపేసింది. ఆ ఘాతుకం జరిగిన సమయానికి ఆమె వయస్సు 22 సంవత్సరాలు. ఇక ప్రాసిక్యూషన్ నేరాన్ని రుజువు చేయడానికి సందర్భోచిత, డిజిటల్, శాస్త్రీయ అంశాలపై ఆధారపడిందని కోర్టు పేర్కొన్నది. దోషి దశలవారీగా ఈ నేరం సాగించడానికి కుట్ర పన్నిందని, ఆమెకు నేర నేపథ్యం ఉందని, గతంలో ఆ యువకుని హత్యకు ప్రయత్నించిన ఆమె దర్యాప్తును తప్పుదోవ పట్టించేందుకు అరెస్టు తరువాత తన ప్రాణం తీసుకునేందుకు ప్రయత్నించిందని కూడా కోర్టు పేర్కొన్నది. కాగా, ఇది అత్యంత అరుదైన కేసు అని, నిందితులకు ఉరిశిక్ష విధించాలని వాదించినట్లు ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ వివిఎస్ వినీత్ కుమార్ మీడియాతో చెప్పారు. ఇది ఆదర్శప్రాయమైన ఒక తీర్పుగా ఆయన పేర్కొన్నారు. 2022లో గ్రీష్మ తన ప్రియుడు శరణ్ రాజ్‌కు పారాక్వాట్ అనే పెస్టిసైడ్ కలిపిన ఆయుర్వేద టానిక్‌తో విషం ఇచ్చింది. దానితో అతని శరీరంలోని పలు అవయవాలు విఫలం కావడంతో 11 రోజుల తరువాత అతను చనిపోయాడు. తమిళనాడుకు చెందిన ఆర్మీలో పని చేసే ఒక వ్యక్తితో తన పెళ్లి ఖాయం కావడంతో రాజ్‌తో తన అనుబంధాన్ని ముగించాలని ఆమె అనుకుంది. కానీ తమ సంబంధం ముగింపునకు అతను నిరాకరించడంతో హత్యకు గ్రీష్మ పథకం వేసింది. హతుడు శరణ్ రాజ్ తిరువనంతపురం జిల్లా పరశ్శల వాసి. హత్యతో సహా భారతీయ న్యాయ సంహితలోని వివిధ సెక్షన్ల కింద గ్రీష్మ దోషిగా తేలింది. ఆమె మేనమామ నిర్మలకుమారన్ నాయర్ సాక్షాలను ధ్వంసం చేసిన కేసులో దోషిగా తేలాడు. అయితే, కస్టడీలోకి తీసుకున్న అతని తల్లి సాక్షాధారాలు లేకపోవడంతో నిర్దోషిగా విడుదల అయింది. కేసు దర్యాప్తును పర్యవేక్షించిన అప్పటి ఎస్‌పి డి శిల్ప కోర్టు తీర్పును స్వాగతిస్తూ, పోలీస్ దర్యాప్తు బృందం సమష్టి కృషికి ఇది విజయం అని అన్నారు.


# పోతూపోతూ బైడెన్ కీలక నిర్ణయం

### ఆంటోనీ ఫౌచీ, మార్క్ మిల్లెలకు క్షమాభిక్ష



**వాషింగ్టన్,**
అమెరికా అధ్యక్ష పదవీకాలం మరికొన్ని గంటల్లో ముగియనున్న వేళ జో బైడెన్ కీలక నిర్ణయాలు తీసుకున్నారు. గతంలో ట్రంప్‌ను విమర్శించిన అమెరికా వైద్య నిపుణుడు డాక్టర్ ఆంటోనీ ఫౌచీ, రిటైర్డ్ జనరల్ మార్క్ మిల్లె తదితరులకు ముందస్తు క్షమాభిక్ష ఆదేశాలు జారీ చేశారు. వీరితోపాటు క్యాపిటల్ హిల్ దాడులపై విచారణ జరిపిన హౌస్ కమిటీ సభ్యులకూ ఉపశమనం కలిగించారు. ట్రంప్ అధికారంలోకి వచ్చిన అనంతరం ప్రతీకార చర్యలు తీసుకునేందుకు వీలు లేకుండా ఈ మేరకు చర్యలు తీసుకున్నట్లు జో బైడెన్ వెల్లడించారు. అమెరికా నూతన అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ ప్రమాణ స్వీకారం చేయనున్న క్రమంలో ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం.

# యాదాద్రీశుడి ఆదాయం రూ.4,17,13,596



**యాదగిరిగుట్ట,**
యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.4,17,13,596 లు చేకూరింది.గత 47 రోజులుగా వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు హుండీలలో సమర్పించిన నగదు, నగల కానుకల లెక్కింపు పర్వం దేవస్థానం చేపట్టింది. కొండకింద ఆధ్యాత్మిక వాడలోని శ్రీసత్య నారాయణస్వామి వ్రత మండపంలో సోమవారం చేపట్టిన లెక్కింపులో ఆలయ ఉద్యోగులు,కల్యాణకట్ట సిబ్బంది,అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు,భక్తులు,మహిళా సేవ సమాఖ్య బృందాలు పాల్గొన్నాయి. కొనసాగిన లెక్కింపులో నగదు రూ.4,17,13,596, మిశ్రమ బంగారం 229 గ్రాములు, వెండి7,050 గ్రాములు చేకూరినట్లు ఈవో భాస్కరరావు తెలిపారు. ఎస్పీఎఫ్ జవాన్లు,సీసీ కెమెరాల నిఘా మధ్య ఉదయం నుంచి సాయంత్రం వరకు లెక్కింపు పర్వం కొనసాగింది.

# సైఫ్ కేసులో కోర్టులో ఇద్దరు లాయర్ల మధ్య గొడవ



**ముంబై,**
బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్‌పై దాడి చేసిన వ్యక్తిని ముంబై పోలీసులు అరెస్టు చేశారు. ఆదివారం మధ్యాహ్నం ముంబై మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ ముందు నిందితుడిని హాజరుపరిచారు. ఈ సందర్భంగా కోర్టులో నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. నిందితుడు షెహజాద్ మహమ్మద్ తరపున వాదించేందుకు ఇద్దరు లాయర్లు గొడవపడ్డారు. దీంతో న్యాయమూర్తి వారిద్దరి మధ్య సయోధ్య కుదిర్చారు. ఇంతకూ ఏం చేశారంటే.. సైఫ్ అలీఖాన్‌పై కత్తితో దాడిచేసిన కేసులో నిందితుడు షరీఫుల్ ఇస్లాం షెహజాద్ మహమ్మద్ రోహిల్లా అమీన్ ఫకీర్ (30)ను ఆదివారం తెల్లవారుజామున అరెస్టు చేశారు. బంగ్లాదేశ్‌కు చెందిన అతడిని థాణేలో అటవీ ప్రాంతంలో ఉన్న ఒక లేబర్ క్యాంప్ వద్ద అదుపులోకి తీసుకున్నారు. అక్కడి నుంచి ముంబైకి తరలించారు. అనంతరం భారీ బందోబస్తు నడుమ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరపరిచారు. నిందితుల బోనులో నిలబడి ఉన్న షెహజాద్‌ను.. పోలీసులపై ఏమైనా ఫిర్యాదులు ఉన్నాయా అంటూ న్యాయమూర్తి ప్రశ్నించారు. దానికి అతడు వ్యతిరేకంగా సమాధానం ఇచ్చాడు. ఈ క్రమంలో షెహజాద్ వద్దకు వెళ్లిన ఓ లాయరు.. అతని తరపున తాను వాదిస్తానంటూ వకాలత్ పత్రంపై సంతకం చేస్తున్నాడు. అంతలోనే మరో న్యాయవాది కూడా నిందితుని వద్దకు వెళ్లి తాను వకాల్తా పుచ్చుకుంటానంటూ సంబంధిత పత్రాలపై సంతకం కోసం ప్రయత్నించాడు. దీంతో ఇద్దరు లాయర్లు కోర్టు హాలులోనే వాదులాడుకున్నారు. దీంతో జోక్యం చేసుకున్న న్యాయమూర్తి.. ఇద్దరూ ఒక టీమ్‌గా అతని తరపున వాదనలు వినిపించవచ్చని తెలిపారు. దానికి ఆ ఇద్దరు లాయర్లు కూడా సమ్మతించారు. కాగా, నిందితుడికి న్యాయస్థానంలో హాజరుపర్చగా ఐదు రోజుల పోలీస్ కస్టడీకి పంపిందని, ఈ దాడి వెనుక అంతర్జాతీయంగా ఏదన్నా కుట్ర ఉందా అన్న కోణంలో కేసు దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు. బంగ్లాదేశ్ నుంచి ఐదు నెలల క్రితం భారత్‌కు అక్రమంగా వచ్చిన నిందితుడు తన పేరును విజయ్ దాస్‌గా మార్చుకున్నాడు. తర్వాత హౌస్ కీపింగ్ సహా చిన్నచిన్న పనులు చేసేవాడు. ఆ ఇల్లు నటుడు సైఫ్ అలీఖాన్‌దని తనకు తెలియదని, కేవలం చోరీ కోసమే అందులో ప్రవేశించినట్టు నిందితుడు తెలియజేసినట్టు పోలీస్ వర్గాలు వెల్లడించాయి.

# దోషి సంజయ్ రాయ్‌కి జీవిత ఖైదు

(మొదటి తరువాయి)

విచారణను పూర్తి చేసిన కోల్‌కతాలోని సీల్దా కోర్టు.. గత శనివారం సంజయ్ రాయ్ దోషి అని తేల్చింది. ఈ కేసులో సోమవారం తీర్పును వెలువరిస్తామని చెప్పిన కోర్టు.. తాజాగా అతడికి జీవిత ఖైదు విధిస్తూ తీర్పును ఇచ్చింది. ఇక సంజయ్ రాయ్ కి ఏం శిక్ష విధిస్తారని దేశం మొత్తం తీవ్ర ఉత్కంఠగా ఎదురుచూస్తుండగా.. అతడికి జీవిత ఖైదు విధించారు. మరోవైపు ఇంత దారుణంగా హత్యాచారం చేసిన సంజయ్ రాయ్ కి ఉరిశిక్ష విధించాలనే డిమాండ్లు వెల్లువెత్తాయి. కేసులో తీర్పు ఇవ్వడానికి ముందుగా సీల్దా కోర్టు జడ్జి జస్టిస్ అనిర్బన్ దాస్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ కేసు అరుదైనది అని తాను భావించడం లేదని.. అందుకే చనిపోయే వరకు జైలు శిక్ష అనుభవించాలని తీర్పును ఇస్తున్నట్లు ప్రకటించారు. ఇదే సమయంలో ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన బాధితురాలి తల్లిదండ్రులకు రూ. 17 లక్షల పరిహారం చెల్లించాలని పశ్చిమ బెంగాల్ ప్రభుత్వాన్ని కోర్టు ఆదేశించింది. 2023 ఆగస్ట్ 9వ తేదీ రాత్రి కోల్‌కతాలోని ఆర్జీకర్ హాస్పిటల్ సెమినార్ రూమ్‌లో నిద్రిస్తున్న జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం, ఆపై హత్య జరగడం దేశంలో తీవ్ర సంచలనాన్ని రేపింది. మొదట కోల్‌కతా పోలీసులు ఈ కేసు విచారణ ప్రారంభించగా.. పశ్చిమ బెంగాల్ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలతో సీబీఐ రంగంలోకి దిగింది. ఈ నేపథ్యంలోనే స్పెషల్ కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేసిన సీబీఐ.. ప్రధాన నిందితుడు సంజయ్ రాయ్ పేరును మాత్రమే అందులో చేర్చింది. అయితే ఈ ఘటనలో సామూహిక అత్యాచారం విషయాన్ని ఛార్జిషీట్‌లో పేర్కొనలేదు. ఆర్జీకర్ మెడికల్ ఆస్పత్రి ఆవరణలోని సీసీటీవీలో నమోదైన దృశ్యాల ఆధారంగా సంజయ్ రాయ్ ని గతేడాది ఆగస్ట్ 10వ తేదీన కోల్‌కతా పోలీసులు అరెస్ట్ చేశారు. ఇదే కేసులో అరెస్ట్ అయిన ఆర్జీకర్ మాజీ ప్రిన్సిపల్ సందీప్ ఘోష్, తాలా పోలీస్ స్టేషన్ మాజీ ఆఫీసర్ ఇంఛార్జ్ అభిజిత్ మండల్‌లకు ఇప్పటికే బెయిల్ లభించింది. ఈ ఘటనలో సాక్ష్యాలు తారుమారు చేశారనే ఆరోపణలపై వారు అరెస్టు కాగా.. అరెస్ట్ తర్వాత 90 రోజుల్లో పోలీసులు, సీబీఐ ఛార్జ్‌షీట్ ్ర÷ల్ చేయకపోవడంతో వారికి బెయిల్ వచ్చింది. జంజ్రయాయ్‌కు జీవిత ఖైదు శిక్ష విధించింది. అతడు మరణించే వరకు జైల్లోనే ఉంచాలని కోర్టు తన తీర్పులో స్పష్టం చేసింది. అలాగే సంజయ్‌రాయ్‌కు రూ.50 వేల జరిమానా సైతం కోర్టు విధించింది. ఈ కేసును సీబీఐ దర్యాప్తు చేసింది. అందులోభాగంగా మొత్తం120 మంది సాక్షులను సీబీఐ విచారించింది. దీంతో భారత న్యాయసంహిత చట్టంలోని సెక్షన్లు 64, 66,103/1 కింద సంజయ్‌కు జీవిత ఖైదు విధించింది. బాధితురాలి కుటుంబానికి న్యాయం జరగాలంటూ దేశవ్యాప్తంగా వైద్యులంతా ఆందోళనకు దిగారు. ఇక పశ్చిమ బెంగాల్ వైద్యులు అయితే.. తమ ఆందోళనలను మరింత ఉధృతం చేశారు. ఆ క్రమంలో వైద్య సేవలు సైతం నిలిచిపోయాయి. దీంతో వారితో చర్చలు జరిపేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. కానీ వైద్యులు.. తమ డిమాండ్లను మమతా బెనర్జీ ముందు ఉంచారు. కానీ వాటిలో కొన్నింటిని మాత్రమే ఆమె ఒప్పుకున్నారు. అనంతరం ప్రభుత్వం దిగి వచ్చి.. వైద్యులతో చర్చలు జరిపింది. అందుకు న్యాయం చేస్తామని.. అందుకు కొంత గడువు కోరింది. దీంతో వైద్యులు సానుకూలంగా స్పందించారు. కానీ ఇచ్చిన హామీలు ప్రభుత్వం నెరవేర్చక పోవడంతో.. వైద్యులు మళ్లీ ఆందోళన బాట పట్టారు. మరోవైపు అత్యవసర సేవలకు ఎటువంటి అటంకం కలిగించమని వైద్యులు ప్రభుత్వానికి హామీ ఇచ్చారు. ఇక ఈ హత్యాచార ఘటనపై ఆర్ జీ కర్ మెడికల్ కాలేజీ ఆసుపత్రి సూపరింటెండెంట్ సందీప్ ఘోష్ వెంటనే స్పందించారు. ఈ హత్యాచార ఘటనను ఆయన ఖండించారు. మృతురాలు తన కుమార్తెతో సమానమన్నారు. ఈ తరహా ఘటనలు భవిష్యత్తులో జరగకూడదని ఆకాంక్షించారు. ఈ మేరకు ఆయన తన ఎక్స్ ఖాతా వేదికగా స్పందించారు. ఆ కొద్ది రోజులకే ఆయన ఆసుపత్రి సూపరింటెండెంట్ పదవికి రాజీనామా చేశారు. ఆయితే ఆ వెంటనే ఆయన్ని మరో మెడికల్ కాలేజీ ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా నియమించింది. క ఆర్ జీ కర్ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా ఉన్న సమయంలో సందీప్ ఘోష్ పై పలు అవినీతి ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో కోర్టు జోక్యం చేసుకొని.. ఆయనను విధుల నుంచి తప్పించాలంటూ ప్రభుత్వాన్ని ఆదేశించిన విషయం విదితమే. ఇక ఇదే తనను బలి పశువును చేశారంటూ నిందితుడు సంజయ్ రాయ్.. కోర్టుకు విన్నవించుకొన్నాడు. అంతేకాదు.. విధులకు హాజరైన ట్రైయినీ వైద్యురాలు.. రాత్రి 11.00 గంటల సమయంలో సెమినార్ హాల్‌లో విశ్రాంతి తీసుకొనేందుకు వెళ్లింది. ఆ ఉదయానికి ఆమె హత్యాచారానికి గురై విగత జీవిగా మారింది. అయితే సెమినార్ హాల్‌లో సీసీ టీవీ కెమెరాలు లేకపోవడం గమనార్హం.

# పెట్టుబడులు తేవడమే లక్ష్యంగా

(మొదటి తరువాయి)

పూర్తి చేసుకుని ఆదివారం రాత్రి దావోస్ పర్యటనకు బయలు దేరింది. దావోస్‌లో నాలుగు రోజుల పాటు జరిగే వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ వార్షిక సదస్సులో పాల్గొంటారు. వరల్డ్ ఎకనమిక్ ఫోరం వేదికగా తెలంగాణకు ఉన్న సానుకూలతలను చాటి చెప్పి పెట్టుబడులను తెచ్చే లక్ష్యంతో సీఎం రేవంత్ రెడ్డి బృందం దావోస్ పర్యటనకు వెళ్లింది. పెట్టుబడుల ఆకర్షణ లక్ష్యంగా దావోస్ లో రేవంత్ రెడ్డి పర్యటన కొనసాగుతుంది. ప్రపంచ అగ్రశ్రేణి పరిశ్రమలు, సంస్థల అధినేతలతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భేటీకానున్నారు. పెట్టుబడుల గమ్యస్థానంగా తెలంగాణను ప్రపంచానికి పరిచయం చేసేందుకు దావోస్ పర్యటనను రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావిస్తోంది. గత ఏడాది దావోస్ పర్యటన సందర్భంగా రాష్ట్రానికి రూ.40 వేల కోట్ల పెట్టుబడులను ప్రభుత్వం సమీకరించింది. ఈసారి అంతకు మించి పెట్టుబడులను తేవడమే లక్ష్యంగా తమ పర్యటన కొనసాగుతుందని సీఎం రేవంత్ రెడ్డి ఇటీవల అధికారులతో సమీక్షలో వెల్లడించారు. ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు, రాష్ట్రంలో చేపడుతున్న వివిధ అభివృద్ధి ప్రాజెక్టులతో అంతర్జాతీయ దిగ్గజ కంపెనీలు పెట్టుబడులకు ఆసక్తి ప్రదర్శిస్తాయనే ఆశాభావం వ్యక్తం చేశారు. ఇప్పటికే గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లకు హైదరాబాద్ అడ్డాగా మారింది. ఐటీ, ఏఐ, ఫార్మా, తయారీ రంగాలకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలతోపాటు ఇటీవల ప్రకటించిన పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి విధానం (క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ)పై ప్రముఖ కంపెనీలు ఆసక్తి ప్రదర్శిస్తున్నాయి. గత ఏడాది దావోస్ పర్యటనతోపాటు అమెరికా, దక్షిణ కొరియా పర్యటనలతో రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు వచ్చాయి. కాగా రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో మరో భారీ ఐటీ పార్కు ఏర్పాటు కానుంది. రూ.450 కోట్లతో కొత్త ఐటీ పార్కును ఏర్పాటు చేసేందుకు సింగపూర్‌కు చెందిన క్యాపిటల్ ల్యాండ్ కంపెనీ ముందుకు వచ్చింది. సుమారు 10 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో అత్యాధునిక సౌకర్యాలతో ఈ ఐటీ పార్కును ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. దావోస్ వేదికగా మంగళవారం నుంచి నాలుగు రోజులపాటు జరిగే 'ప్రపంచ ఆర్థిక ఫోరం' వార్షిక సదస్సులో ఈ బృందం పాల్గొననుంది. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న కంపెనీలు ఈ సదస్సుకు హాజరు కానున్న నేపథ్యంలో.. ఆ వేదికపై తెలంగాణలో కంపెనీల ఏర్పాటుకు ఉన్న అనుకూలతలను వివరించి, హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి పెట్టుబడుల గమ్యస్థానంగా పరిచయం చేయనున్నారు.

# కర్మభూమితో పాటు జన్మభూమికి పాటుపడండి

(మొదటి తరువాయి)

ఆర్థిక సదస్సులో పాల్గొనేందుకు దావోస్ వెళ్లిన ఆయన జ్యూరిచ్‌లో అక్కడి పారిశ్రామికవేత్తలతో భేటీ అయ్యారు. యూరప్‌లోని 12 దేశాల నుంచి వ్యాపారవేత్తలు ఈ సమావేశానికి రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. తాను బిల్‌గేట్స్‌ను కలవడం ద్వారా హైదరాబాద్‌లో మైక్రోసాఫ్ట్ వచ్చిందని, సత్యనాదెళ్ల లాంటి వారు ఇప్పుడు సిఇవో అయ్యారని చంద్రబాబు అన్నారు. తాను ఐటి గురించి మాట్లాడితే అంతా ఆశ్చర్యంగా చూశారని, కాని ఇవాళ ప్రపంచవ్యాప్తంగా తెలుగువారు దూసుకు పోతున్నారని అన్నారు. ఎపిలో ఇప్పుడు అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని అన్నారు. 2004లో అధికారం కొనసాగివుంటే పరిస్థితి మరోలా ఉండేదన్నారు. ఎపిలో గత ఐదేళ్లలో విధ్వంసం సాగిందన్నారు. తాను విజన్ 2047తో ముందుకు వెళుతున్నానని అన్నారు. ప్రధాని మోడీ దేశం కోసం వికసిత్ భారత్‌తో కృషి చేస్తున్నారని అన్నారు. ప్రపంచంలోని అన్ని దేశాల్లోనూ తెలుగువారుంటారని, అవకాశం ఉన్న ప్రతిచోటుకీ మనవాళ్లు వెళ్లిపోతారని చెప్పారు. 'అన్ని దేశాల్లో తెలుగువాళ్ల ఫుట్ ప్రింట్ ఉంటుంది. అదే మన గొప్పతనం. తెలుగువాళ్లు ఎక్కడైనా గొప్పగా పని చేస్తారు. రాణిస్తారు. పట్టుదల ఎక్కువ. నైపుణ్యాలు పెంచుకుంటారు. నేను జైల్లో చేసిన న్యాయ పోరాటానికి మద్దతుగా నిలిచారు. అప్పుడు ఇన్ని దేశాల్లో తెలుగువాళ్లు ఉన్నారా? అని ఆశ్చర్యపోయా. మరో జన్మ ఉంటే తెలుగువాడిగానే పుట్టించాలని దేవుడిని కోరుకుంటున్నా. యువతలో సరికొత్త ఆలోచనలు రావాలి. చైతన్యవంతులు కావాలి' 'ఆ రోజుల్లో ఐటీకి ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చా. అనేకమంది యువత గ్రామాల నుంచి నగరాలకు వచ్చి ఇంజినీరింగ్ విద్యను అభ్యసించి, ఐటీ రంగంలోకి వచ్చారు. హైదరాబాద్‌లో భూములు అమ్ముకోవద్దని అనేకమందికి చెప్పా. ఇక్కడి భూములకు మంచి ధర వస్తుందని ఆనాడే చెప్పా. తెలంగాణలో అత్యధిక తలసరి ఆదాయానికి హైదరాబాద్ సంపదే కారణం. చదువులో ఆడపిల్లలపై వివక్ష చూపించొద్దని ఆనాడే చెప్పాను. ఇప్పుడు ఏ ఐటీ కంపెనీకి వెళ్లినా అమ్మాయిలు కనిపిస్తున్నారు.

# అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ ప్రమాణం

(మొదటి తరువాయి)

1861లో అబ్రహాం లింకన్ ప్రమాణ స్వీకారం చేయడానికి ఉపయోగించిన బైబిల్, తన బైబిల్‌ను చేతిలో పట్టుకొని ట్రంప్ బాధ్యతలు స్వీకరించారు. ట్రంప్ కంటే ముందు ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ప్రమాణ స్వీకారం చేశారు. దేశ, విదేశీ అతిథులతో క్యాపిటల్ హిల్ రోటుండా కిటకిటలాడింది.

ప్రమాణస్వీకారోత్సవానికి ముందు జో బైడెన్‌ను కలిసేందుకు ట్రంప్ శ్వేత సౌధానికి వెళ్లగా.. ఆయనకు బైడన్ దంపతులు సాదరస్వాగతం పలికారు. పరస్పరం కరచాలనం చేసుకున్నారు. అనంతరం శ్వేతసౌధం

నుంచి వాషింగ్టన్ డీసీ క్యాపిటల్ హిల్‌లోని రోటుండా ఇండోర్‌లో జరిగే ప్రమాణస్వీకారోత్సవానికి జో బైడెన్, ట్రంప్ ఒకే వాహనంలో వెళ్లారు. భారత్ తరఫున ఈ ప్రమాణస్వీకారోత్సవానికి కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి ఎస్.జైశంకర్ హాజరయ్యారు. ప్రధాని నరేంద్ర మోదీ తరఫున హాజరైన జైశంకర్.. ట్రంప్‌నకు మోదీ రాసిన లేఖను అందజేసారు. మెరికా అధ్యక్షుడి ప్రమాణస్వీకార వేడుకకు భారత్ తరఫున ప్రాతినిధ్యం వహించే అరుదైన గౌరవం తనకు దక్కిందని ఆనందం వ్యక్తం చేశారు. ఈ వేడుకకు ముకేశ్ అంబానీ దంపతులు సైతం హాజరయ్యారు. పలువురు అమెరికా మాజీ అధ్యక్షులు సతీసమేతంగా ఈ వేడుకకు విచ్చేశారు. బిల్ క్లింటన్, హిల్లరీ క్లింటన్, జార్జి డబ్ల్యూ బుష్, లారా బుష్ తదితరులు విచ్చేశారు. బరాక్ ఒబామా హాజరైనప్పటికీ మిచెల్లీ ఒబామా మాత్రం ఈ వేడుకకు రావడంలేదని ముందే ప్రకటించారు. అమెరికా సుప్రీంకోర్టుకు చెందిన తొమ్మిది మంది జడ్జిలు ఈ వేడుకకు హాజరయ్యారు. ట్రంప్ క్యాబినెట్‌లో చోటు దక్కించుకున్న నేతలతో పాటు వివేక్ రామస్వామి, టెస్లా అధిపతి ఎలాన్ మస్క్, జెఫ్ బెజోస్, మార్క్ జుకర్ బర్గ్, టిమ్ కుక్, సుందర్ పిచాయ్ తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల కోసం మరో అవకాశం

(మొదటి తరువాయి)

ఆదేశించారు సీఎస్ శాంతి కుమారి. దీనికి సంబంధించి గైడ్స్ లైన్స్ తో సర్క్యులర్ పంపించారు. గ్రామ సభల్లో కొత్త రేషన్ కార్డులతో పాటు ఇప్పటికే ఉన్న కార్డుల్లో పేర్లు చేర్చడానికి దరఖాస్తులు స్వీకరించాలి. ఒకే కుటుంబం నుంచి వేరే పడ్డున్న కుటుంబాలకు కొత్త కార్డులు ఇచ్చేందుకు అప్లికేషన్లు తీసుకోవాలి. కుటుంబ పెద్దతో పాటు ఇతర కుటుంబ సభ్యుల వివరాలు, వారి ఆధార్ కార్డులు, కులం, మొబైల్ నంబర్, చిరునామా వంటి వివరాలను తీసుకోవాలని గైడ్ లైన్స్ లో స్పష్టం చేశారు.

# రాహుల్ గాంధీకి ఊరట

(మొదటి తరువాయి)

మంత్రి అమిత్ షాపై రాహుల్ గాంధీ అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు. అమిత్ షా ఓ హత్య కేసులో నిందితుడని రాహుల్ ఆరోపించారు. ఆ ఘటనలో రాహుల్‌పై క్రిమినల్ డిఫమేషన్ కేసు బుక్ చేశారు. రాహుల్ వ్యాఖ్యలపై బీజేపీ కార్యకర్త నవీన్ ఝూ పరువునష్టం కేసు దాఖలు చేశారు. దీనిపై ట్రయల్ కోర్టు విచారణ జరిపింది. విచారణ సందర్భంగా వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలన్న రాహుల్ అభ్యర్థనను కోర్టు తిరస్కరించింది. దీంతో రాహుల్.. జార?ండ్ హైకోర్టును ఆశ్రయించారు. అయితే, ఈ విషయంలో జోక్యం చేసుకోవడానికి జార?ండ్ కోర్టు నిరాకరించింది. దీంతో రాహుల్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. క్రిమినల్ పరువునష్టం కేసుకు సంబంధించి ట్రయల్ కోర్టులో తనపై విచారణను రద్దు చేయాలని క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన దేశ అత్యున్నత న్యాయస్థానం.. ట్రయల్ కోర్టులో ఈ కేసు విచారణపై స్టే విధించింది. ఈ మేరకు జార్ఖండ్ ప్రభుత్వానికి, బీజేపీ నేత నవీన్ ఝూకు నోటీసులు జారీ చేసింది. నాలుగు వారాల్లోగా సమాధానాలు ఇవ్వాలని న్యాయస్థానం ఆదేశించింది.

# చిన్మయ్ కృష్ణ దాస్‌కు మరోసారి నిరాశ

(మొదటి తరువాయి)

సోమవారం నాడు విచారణకు రాలేదు. వచ్చే వారం విచారణకు వచ్చే అవకాశం ఉందని ఆయన తరఫు న్యాయవాది తెలిపారు. చిన్మయ్ బెయిలు పిటిషన్‌ను చిట్టగాండ్‌లోని దిగువ కోర్టు జనవరి 2న తోసిపుచ్చింది. దీనిపై ఆయన హైకోర్టును ఆశ్రయించారు. కాగా, చిన్మయ్ కృష్ణ దాస్‌కు బెయిలు మంజూరు చేయాలని కోరుతూ జనవరి 12న హైకోర్టులో పిటిషన్ వేశామని, 20న విచారణకు రావాల్సి ఉందని ఆయన తరఫు న్యాయవాది చెప్పారు. అయితే, పెండింగ్ కేసులను సీరియల్ ప్రకారం కోర్టు విచారణ జరుపుతుందని, ఆ ప్రకారం వచ్చే వారం కేసు విచారణకు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ఇలాంటి కేసులను ఆది, సోమవారాల్లో మాత్రమే హైకోర్టు విచారణ జరుపుతుందని చెప్పారు. ఇస్కాన్' మాజీ ప్రచారకర్తగా ఉన్న చిన్మయ్ దాస్‌ను గత ఏడాది నవంబర్ 25న ఢాకాలోని హజ్రత్ అంతర్జాతీయ విమానాశ్రయంలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆ మరుసటి రోజు కోర్టు ముందు హాజరుపరిచారు. బంగ్లాదేశ్ జాతీయ జెండాను అగౌరవపరిచారంటూ చిన్మయ్‌పై దేశద్రోహం కేసు నమోదు కావడంతో ఆయనకు బెయిల్ ఇచ్చేందుకు కోర్టు నిరాకరించింది. జైలుకు పంపుతూ ఆదేశాలిచ్చింది. దీంతో కోర్టు వెలుపల ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఆయనను విడిచిపెట్టాలంటూ హిందూ అనుకూల వాదులు, ఆయన అనుయాయులు ఆందోళనకు దిగారు. దీంతో వారికి, పోలీసులకు మధ్య ఘర్షణ నెలకొంది. చిన్మయ్ అరెస్టుకు వ్యతిరేకంగా ఢాకా, ఇతర ప్రాంతాల్లో నిరసనలు వెల్లువెత్తాయి.

# సఫాయి అన్నకు సలాం కొట్టిన ఒకే ఒక్కడు కేసీఆర్

(మొదటి తరువాయి)

ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ తెలిపారు. సఫాయి అన్న.. నీకు సలాం అన్న సీఎం ఈ దేశంలో ఎవరూ లేరు.. కేవలం కేసీఆర్ మాత్రమే అని కేటీఆర్ స్పష్టం చేశారు. తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ పార్టీ కార్మిక విభాగం క్యాలెండర్ ఆవిష్కరణ సందర్భంగా కేటీఆర్ మాట్లాడారు. కేసీఆర్ హమాలీలు, ఆటో డ్రైవర్ల కోసమే కాదు.. అందరి కోసం పని చేశారు. కార్మికుల ఇబ్బందులు, చికాకులు పరిష్కరించేందుకు కేసీఆర్ ఎంతో కృషి చేశారు. జీహెచ్ఎంసీలో సఫాయి కార్మికులకు మూడు సార్లు జీతాలు పెంచారు. తెలంగాణ ఏర్పడక ముందు నాటి ప్రభుత్వాలు అంగన్‌వాడీ టీచర్లను గుర్రాలతో తొక్కించారు. కానీ కేసీఆర్ ప్రభుత్వం వారిని పెద్ద మనసుతో ఆశీర్వదించింది. అంగన్‌వాడీల జీతం రూ. 4500 ఉంటే రూ. 13650కు పెంచారు. మినీ అంగన్‌వాడీలకు రూ. 2200 ఉంటే రూ.7800 చేశారు. ఇటీవల హైదరాబాద్ నగరంలో ఆశా వర్కర్ల పట్ల పోలీసుల అసభ్యంగా ప్రవర్తించారు. సీఎం రేవంత్ రెడ్డి మాదిరిగానే పోలీసులు కూడా ప్రవర్తించారు. ఆశావర్కర్లకు జీతాలు రూ. 2500 ఉంటే రూ. 9750 దాకా తీసుకువెళ్లాం. ఉపాధి హామీలో పని చేసే ఫీల్డ్ అసిస్టెంట్లకు కూడా జీతాలు పెంచినం. అన్ని రంగాల్లో పని చేసే కార్మికులను గుండెల్లో పెట్టుకున్నామని కేటీఆర్ తెలిపారు. హోంగార్డుల విషయం బాధాకరం. మొన్న ఒక హోంగార్డు కలిసి కళ్లల్లో నీళ్లు పెట్టుకున్నడు. రూ. 9 వేలు ఉండే జీతాన్ని రూ. 25 వేలు చేసిండు కేసీఆర్.. ఆయన దేవుడు. ఎందుకు ఓడగొట్టారు. ఆయన ఉంటే మాకు ఇంకా లాభం జరిగేది. పోలీసులతో సమానంగా పే స్కేలు వచ్చేది.. మూడు పూటల అన్నం తింటున్నాం అంటే కేసీఆర్ పుణ్యమే అని ఆ హోంగార్డు చెప్పి బాధపడ్డాడని కేటీఆర్ గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల కంటే రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు 73 శాతం వేతనాలు పెంచారు. దేశంలో అత్యధిక జీతాలు పొందుతున్న ఉద్యోగులు తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులే. ఇది చిన్న విషయం కాదు. కాంట్రాక్టర్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు పీఆర్సీ వర్తింపజేశాం. అలాగే నాలుగున్నర లక్షల మంది బీడీ కార్మికులకు పెన్షన్లు ఇచ్చాం. 26 లక్షల మంది ప్రయివేటు డ్రైవర్లకు 5 లక్షల జీవిత బీమా ఇచ్చారు కేసీఆర్. వైద్య రంగం, మున్సిపల్ రంగంలో జీతాలు పెంచుకుంటూ పోయామని కేటీఆర్ తెలిపారు.

## సంపాదకీయం

# దావోస్ పర్యటనలతో సాధించేదేమిటి ?

దావోస్‌లో ప్రపంచ పెట్టుబడుల సదస్సుకు ఇరు తెలుగు రాష్ట్రాల సిఎంలు రేవంత్ రెడ్డి, చంద్రబాబు నాయుడులు వెళ్లారు. పెట్టుబడులే లక్ష్యంగా వీరు అడుగులు వేస్తున్నారు. హైదరాబాద్‌కు ఉన్న బ్రాండ్‌తో తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి తనవంతు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇది ఆయనకు రెండో పర్యటనగా కలిసివస్తుందేమో చూడాలి. చంద్రబాబుకు ప్రపంచంలో సొంత బ్రాండ్ ఇమేజ్ ఉంది. అమరావతి కొత్త రాజధానిగా అవతరించినందున ఆయనకు సానుకూలత కాగలదు. అయితే ఇదంతా ఒక ఎత్తయితే.. సింగపూర్‌లా రాష్ట్రాలను అభివృద్ధి చేసేందుకు స్థానికంగా ఉన్న యువతకు ప్రోత్సాహం ఇవ్వాల్సి ఉంటుంది. స్థానిక వనరులు, స్థానిక యువతను ప్రోత్సహిస్తే ఆదాయవనరులు కూడా పెరగగలవు. కానీ మేక్ ఇన్ ఇండియా అంటున్న ప్రధాని కూడా పెద్ద ఎత్తున ఈ రకమైన ప్రోత్సాహం ఇవ్వడం లేదు. దేశీయంగా యువతకు ఉపాధి కల్పించడానికి బ్యాంకులను ప్రోత్సహించాలి. విరివిగా రుణాలు ఇవ్వాలి. వ్యవసాయం, వ్యవసాయాధిరత పరిశ్రమలు, కోళ్లు, పశువులు, గొర్లు, మేకల పెంపకం వంటి వాటికి అవసరమైతే వడ్డీరహిత రుణాలను ఇవ్వగలగాలి. యువత విదేశాలవైపు చూడకుండా ఉండాలంటే ఇలాంటి స్వయం ఉపాధి రంగాలను ప్రోత్సహించాల్సి ఉంటుంది. విదేశీ కంపెనీలను, పెట్టుబడులను ఆహ్వానించి పెద్ద ఎత్తున ఏదో చేయాలన్న ఆలోచన కూడా సరికాదు. ప్రభుత్వ రంగాన్ని, ఉద్యోగులను కుదించడం, సంక్షేమాన్ని వదిలేసి యూజర్ ఛార్జీలు వసూలు చేయడం ఇలాంటి వాటిని కొత్తగా పాలసీలు, విజన్ పేరుతో అమలు చేసేందుకు ఎపిలో కూటమి ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. రెగ్యులేటరీ కమిషన్లు, ప్రైవేటీకరణకు వీలుగా ప్రత్యేక వ్యవస్థలు ఏర్పాటు చేయబోతు న్నారు. తెలుగుదేశం కూటమి ప్రభుత్వ పాలనలో అన్నిటిలోనూ ప్రపంచబ్యాంకు విధానాలు గోచరిస్తున్నాయన్న విమర్శలు వస్తున్నాయి. స్వర్ణాంధ్ర విజన్ 2047, వివిధ రంగాలపై తీసుకొచ్చిన సుమారు 22 పాలసీల్లో గతంలో ప్రపంచబ్యాంకు ఏదైతే చెప్పిందో వాటిని మళ్లీ వేర్వేరు రూపాల్లో తిరిగి తెస్తోందన్న ఆరోపణలు ఉన్నాయి. అయితే అవి ఎలా వున్నా.. స్థానికంగా ఉన్న వనరులతో స్థానిక యువతను ప్రోత్సహించేందుకు ప్రణాళికలు సిద్దం చేయాలి. తక్కువ పెట్టుబడులతో పెద్ద మొత్తంలో ఉపాధికి అవకాశాలను అన్వేషించాలి. విదేశీ పెట్టుబడులు అనగానే ముఖ్యంగా విద్యుత్, నీటిని వ్యాపారం చేయడం, అడిగిన వారికి భూములు అప్పగించడం, పట్టణ ప్రాంతాల్లో పెద్దపెద్ద వ్యాపార సంస్థలకు అనువుగా అర్బన్ ల్యాండ్ సీలింగ్ చట్టాన్ని సవరించడం, వ్యవసాయంలో యాంత్రీకరణ పెంచడం, ప్రభుత్వ ఉద్యోగాల సంఖ్యను తగ్గించడం, విదేశీ వ్యాపార సంస్థలకు ఎటువంటి అడ్డంకులూ లేకుండా చేయడం వంటి అంశాలు తునమీదకు వస్తున్నాయి. మరీ ముఖ్యంగా వ్యవసాయ భూములను పారిశ్రామిక ప్రాంతాలుగా మార్చడం, ఆహార పంటల స్థానంలో వాణిజ్య పంటలు పెంచడం, ఆహార ఉత్పత్తులను తగ్గించడం ఇవన్నీ కూడా ఆందోళనకర అంశాలు మారుతున్నాయి. ప్రధానంగా వ్యయసాయ భూములను బలవంతంగా లాక్కుని కార్పోరేట్లకు కట్టబెడు తున్నారు. ఇలాంటి పరిస్థితి పోవాలి. కొత్తగా తీసుకొచ్చే పరిశ్రమలు, పారిశ్రామిక పాలసీల్లో లక్షల మందికి ఉపాధి కల్పన ఉంటుందని పేర్కొంటున్నారు. కానీ ఎక్కడా అలాంటిదేమీ కనిపించడం లేదు. విదేశీ పెట్టుబడులకు దాసోహమంటూ ఇక్కడి వనరులను దోచిపెడుతున్న పాలకులు దేశీయంగా యువత ముందుకు వస్తే మాత్రం..ఓ పైసా వడ్డీకూడా తగ్గించడం లేదు. ఉచిత విద్యుత్ ఇవ్వరు. భూమలు ఇవ్వరు. నీరు ఇవ్వరు. దీనిని బట్టి ప్రపంచీకరణ ప్రభావంతో దేశంలో విదేశీయుల పెత్తనం పెరగిపోవడం ఖాయం. అదే సమయంలో ఉత్పాదకతలో సాంకేతికతను పెంచాల్సి ఉంది. ఆధునీకరణ పేరిట ఇప్పటికే ఉన్న ఉపాధి పోతుంటే కొత్త ఉపాధి వస్తుందని మభ్యపెట్టడం తప్ప మరొకటి కాదు. వ్యవసాయంలో యాంత్రీకరణ, పారిశ్రామిక ఆధునీకరణ అవసరమే. అయితే అది ఉన్న ఉపాధిని దెబ్బతీయకుండా చూసుకోవాలి. సంస్కరణల్లో భాగంగా ఉద్యోగాలను ప్రైవేటుపరం చేయడం ద్వారా ఖర్చును తగ్గించుకోవాలని కేంద్ర రాష్ట్రాల ప్రభుత్వాలు చూస్తున్నాయి. తమపై భారం లేకుండా చూడాలని చూస్తున్నారు. జీతాలు, పెన్షన్లు తగ్గించుకోవాలన్న క్రమంలో ప్రైవేట్ పెట్టుబడులకు పెద్దపీట వేస్తున్నారు. దావోస్ లాంటి సదస్సులు ఇందుకు వేదికగా మారుతున్నాయి. ప్రభుత్వం ప్రైవేటు ఇండిస్ట్రియల్ పార్కులు తెచ్చి రైతులు నేరుగా వారికి భూములు అప్పగించొచ్చనీ ప్రకటించడమే కాకుండా రాయితీలూ ఇస్తామని ప్రభుత్వం చెబుతున్నది. గతంలో తీసుకొచ్చిన సరళీకరణ విధానాల్లో పారిశ్రామిక అవసరాలకు తగిన విధంగా భూములు కేటాయింపులు జరపాలనేది కీలకమైన షరతు. దీన్ని ఇప్పుడు పాలసీ రూపంలో ముందుకు తీసుకొచ్చారు. అయితే ఇదంతా చేసే బదులు ఎవరికి వారు స్వయం ఉపాధి రంగాన్ని ఎంచుకుంటే బ్యాంకు రుణాలు, నీటి సదుపాయాలు, విద్యుత్ సౌకర్యాలు ఇస్తే దేశీయంగానే చిన్నచిన్న పరిశ్రమలు స్థాపన సులువు కాగలదు. దానికి దావోస్ లాంటి సదస్సులకు వెళ్లడం, వెంపర్లాడడం, బతిమాడం వంటివన్నీ చేయకుండానే లక్ష్యం నెరవేర్చుకోగలం. కేవలం ఉన్న మానవ వనరులను,సహజ వనరులను ఉపయోగించుకుంటే మంచిది. అలాంటి ప్రయత్నాలు మొదలు కావాలి. ఎన్‌డిఎ భాగస్వామిగా ఉన్న చంద్రబాబు లాంటి వారు ఇలాంటి ప్రయత్నాలు చేయాలి. దేశీయంగా రుణాలను ఇచ్చేందుకు పారదర్శక విధానం అమలు కావాలి. తక్కువ వడ్డీలకు రుణాలు ఇచ్చేలా పాలసీలను రూపొందించాలి. అప్పుడే ఉపాధి పెరుగుతుంది. పరిశ్రమలు వస్తాయి. స్వయం ఉపాధి పెరుగుతుంది. ద్రవ్యోల్బణం తగ్గుతుంది. దావోస్ పర్యటనలతో డబ్బు వృధా చేసుకునే బదులు దేశీయ ఆలోచనలతో ముందుకు నడవడం అవసరం.

# అదానీ-ఆర్థిక వ్యవస్థ!



చారు తాగుతూ పేపర్ చదువుతున్న పుష్పకుమార్ ఒక్కసారి గా పాత సినిమాలో విలన్‌లా వికటాట్టహాసం చేశాడు. వంటింట్లో పనిలో ఉన్న లక్ష్మి కంగారుపడి హాల్లోకి వచ్చింది.

"చూశావా! చివరికి మంచే గెలుస్తుంది!" అన్నాడు పుష్పకుమార్ భార్యతో.

"చివరికి మంచి గెలిచే మాట నిజం! అంతేకాని గెలిచిన ప్రతిదీ మంచి కాకపోవచ్చు. ఒక్కసారి చెడు కూడా గెలుస్తుంటుంది. అంత మాత్రాన అదంతా మంచి కాదు!" ఇంతకూ మీ వికటాట్టహాసానికి కారణం సెలవియ్యండి మహాప్రభూ!" అన్నది లక్ష్మి.

"హిండెన్‌బర్గ్ దుకాణం మూసేశారంట!" అన్నాడు పుష్పకుమార్ చిద్విలాసంగా.

"ఆ దుకాణం మూసేస్తే మీకెందుకింత ఆనందం!" ఆశ్చర్యంగా అడిగింది లక్ష్మి.

"మన దేశ ఆర్థిక వ్యవస్థను దెబ్బ తీయాలని ఎన్ని కుట్రలు చేసింది? చేసిన పాపం ఊరికే పోదు! సనాతన ధర్మం జోలికొస్తే పుట్ట గతులుండవు!" అన్నాడు పుష్పకుమార్.

"నేను మీకు చారు మాత్రమే ఇచ్చాను. అందులో మీరేదైనా కలుపుకున్నారా ఏమిటి? ఒకదానికొకటి సంబంధం లేకుండా మాట్లాడు తున్నారు? ఆర్థిక వ్యవస్థకూ, సనాతన ధర్మానికి లింకు ఏమిటండి?" అడిగింది లక్ష్మి.

"పిచ్చిదానా అదొక ధర్మ సూక్ష్మం! అలాంటి లోతైన విషయాలు నీలాంటి అర్భకులకు అర్థం కావులే!" అన్నాడు పుష్ప కుమార్ మరింత చిద్విలాసంగా!

"అర్థమయ్యేలా చెప్పండి స్వామి!" అన్నది లక్ష్మి

"మునిగిపోతున్న దేశ ఆర్థిక వ్యవస్థను నిలబెడుతున్నది ఎవరో తెలుసా? అదానీ, అంబానీలే! వారిద్దరినీ దెబ్బతీస్తే ఈ దేశ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలుతుంది! దేశ ఆర్థిక వ్యవస్థ కూలిపోతే పెద్దాయన కీర్తి, ప్రతిష్టలు దెబ్బతిని ప్రభుత్వం పడిపోతుంది! ఈ భూ ప్రపంచంలో సనాతన ధర్మాన్ని పరిరక్షించే ఏకైన ప్రభుత్వం అధికారం లేకపోతే, సైతానులు, రాక్షసులు అధికారంలోకి వస్తారు. అప్పుడంతా అల్లకల్లోలమే!" అని పుష్ప కుమార్ అంటూండగానే లక్ష్మి కళ్లు తిరిగి కింద పడిపోయింది! నీళ్లు చల్లాక లేచి కూర్చున్నది.

"అదానీకి నష్టం జరిగితే ప్రపంచం సర్వనాశనం అవుతుందా? అప్పుడెప్పుడో ఇందిరే ఇండియా అనే వారంటా. ఇప్పుడు అదానీయే ఆర్థిక వ్యవస్థ అయ్యిందన్నమాట!" అన్నది లక్ష్మి.

"అదానీ అంటే మరేమిటనుకున్నావు!" అన్నాడు పుష్పకుమార్.

"హిండెన్‌బర్గ్ సంస్థ మూసేస్తే, ఆ సంస్థ చెప్పినవి అబద్ధాలు అయిపోతాయా?" అడిగింది లక్ష్మి.

"అంతేకదా! అదానీ, మోడీని, మన దేశాన్ని దెబ్బ తీయడానికి ఆ హిండెన్‌బర్గ్ సంస్థ పెట్టి, అబద్ధాలు ప్రచారం చేసి, అది నిరూపించలేక, ఇప్పుడు దుకాణం మూసేసి, తెరవెనక్కి పోతున్నారు!" అన్నాడు పుష్పకుమార్. లక్ష్మి చిన్నగా నవ్వింది.

"ఎందుకు నవ్వుతావు!" చిరాగ్గా అడిగాడు పుష్పకుమార్.

"అదానీ మీద కూడా ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన ఆరోపణలు చేసింది హిండెన్‌బర్గ్ సంస్థ. అనేక సాక్ష్యాధారాలున్న పత్రాలు కూడా బయటపెట్టింది. మీరు అవన్నీ అబద్ధమని అనుకోవచ్చు! కాని ఆ అక్రమాల మీద పూర్తి స్థాయిలో విచారణ జరిపించి, విచారణలో ఆరోపణలు రుజువు కాకపోతే అప్పుడు అదానీని దెబ్బ తీయటానికి కుట్ర పన్నారని అనవచ్చు. మన దేశంలో ఇప్పటి వరకూ అదానీపై అలాంటి విచారణ ఏదీ జరగలేదు కదా!" అన్నది లక్ష్మి. "అదానీ మీద ఎలాంటి విచారణ అవసరం లేదు! ఆయన మచ్చ లేని చంద్రుడు!" అన్నాడు పుష్పకుమార్.

"అలా అని మీరనుకోవచ్చు. కాని అదానీ అంతగా అవకతవకలు చేస్తున్నా విచారణ కూడా జరిపించలేదని విదేశాల్లో అంతా నవ్వు కుంటున్నారు! ఇదే అమెరికా, న్యూజిలాండ్ లాంటి దేశాల్లో జరిగితే ప్రభుత్వం దిగిపోయి ఉండేది! మీరేమో సనాతన ధర్మం అంటూ సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు!" అన్నది లక్ష్మి.

"ఇదుగో నన్నేమైనా అను! కాని అదానీని, సనాతన ధర్మాన్ని ఏమైనా అంటే సహించను!" అన్నాడు పుష్పకుమార్ కోపంగా.

"మీరు చేస్తున్నది గవర్నమెంటు ఉద్యోగం! తింటున్నది ప్రజల సొమ్ము! అదాని పాట పాడటానికి సిగ్గుగా లేదు? పెద్దాయన అమలు చేస్తున్న విధానం వల్ల మన లాంటి వాళ్ల రెక్కల కష్టం అదానీ జేబుల్లోకి వెళు తున్నదని తెలుసుకోండి! ఈ దోపిడీ మనకు అర్థం కాకూడదనే సనాతన ధర్మాన్ని అడ్డుపెడు తున్నారు. ఇది అర్థం చేసుకోవటం మీలాంటి వాళ్లకి మరీ అవసరం!" అని ముగించింది లక్ష్మి.

# ద్రోహభాషణం



వాళ్లు అలా మాట్లాడటం ఆశ్చర్యం అనిపించదు. వాళ్లలానే మాట్లాడుతారు. కానీ అశేష భారత ప్రజలు వాటినంగీకరించరు. న్యాయము, చట్టము, రాజ్యాంగము, ప్రజాస్వామ్య వ్యవస్థా ఏవీ కూడా ఒప్పుకోవు! అయినా వాళ్ల చరిత్ర పుట్టుక తెలిసిన వాళ్లకు ఈ మాటలు కొత్తేమీ కాదు. ఒక్కొక్క అడుగూ వేసుకుంటూ, ఒక్కొక్క ప్రజాస్వామిక సంస్థనీ తొక్కుకుంటూ ఇపుడు స్వాతంత్ర్యం, రాజ్యాంగం మీదకీ వచ్చేస్తున్నారు. ఇప్పుడీ అనాగరిక సంభాషణలను నిర్భయంగా పలుకుతున్నారు. నిలువరించి, నిలేయకపోతే ఎంతకైనా తెగించే అవకాశమూ ఉంది. జాగరూకులమై ఉండాలి మనమిప్పుడు. లేకుంటే ప్రమాదం వెన్నంటుతుంది.

స్వాతంత్ర్యం వచ్చి డెబ్బయి ఐదేండ్లయిన సందర్భంగా ఆజాదీ అమృత మహోత్సవాలు జరుపుకుని నడుస్తున్న వేళ, ఇది స్వాతంత్ర్యమేకాదని గుర్తించ నిరాకరించడం ఈ దేశభక్త నాయకునికి ఎలా సాధ్యమయింది! ఈ మధ్య రాష్ట్రీయ స్వయం సేవక సంఘం అధిపతి మోహన్ భగవత్ మాట్లాడుతూ దేశానికి 1947 ఆగస్టు 15న వచ్చింది అసలు స్వాతంత్ర్యం కాదని, 2024 జనవరి 22న అయోధ్యలో రామమందిర ప్రతిష్టాపన తోనే దేశానికి నిజమైన స్వాతంత్ర్యం వచ్చిందని పేర్కొన్నాడు. అంతేకాదు, రాముడు, కృష్ణుడు, శివుడు కేవలం దేవుళ్లే కాదు, మన నాగరికతా విలువలకు, సనాతన ధర్మానికి గుర్తులు అని బోధించారు. రెండు విలువల మధ్య యుద్ధం జరిగి విజయం పొందిన సందర్భం అని సెలవిచ్చారు. ఇది అత్యంత దారుణమైన విషయం. రాముడు, కృష్ణుడు, శివుడు ఇంకా ముప్పది మూడు కోట్ల దేవుళ్లు ఉండవచ్చు గాక, వారిని విశ్వాసాల మేరకు ఆరాధించనూవచ్చు. కానీ వారికి గుడులను నిర్మించడానికి, విగ్రహాలు ప్రతిష్టించడానికీ, మన దేశ స్వాతంత్ర్యానికి ముడివేయటం అసంబద్ధమైన వాదం మాత్రమే. ఒక దేవుని గుడిని కూలగొట్టి, మరో దేవునికి గుడి కట్టడం స్వాతంత్ర్యం ఎలా అవుతుంది! అంతేకాదు, ఈ వాదన మనం ఇంతకాలంగా అనుభవిస్తున్న స్వేచ్ఛను, ఆధునిక ప్రజాస్వామిక విధానాన్ని, రాజ్యాంగ విలువలను అపహాస్యం చేసినట్టేకదా! రెండువందల యేండ్ల ఆంగ్లేయుల పాలన నుండి విముక్తి పొందేందుకు ప్రజలు పోరాడిన చరిత్రనంతా చులకన చేయటం వారికే చెల్లింది. ఎంతోమంది యోధులు తమ జీవితాలను త్యాగం చేశారు. ప్రాణాలిచ్చారు. ఉరికంభాలెక్కారు. ఆఖరికి స్వేచ్ఛను సాధించారు. ఎలాంటి పాలన కావాలో ఆలోచించి ప్రజాస్వామిక విలువలతో కూడిన రాజ్యాంగాన్ని ఏర్పాటు చేసుకున్నారు. వీటన్నింటినీ ఒక్కమాటతో తిరస్కరిస్తారా! ప్రాణత్యాగాలను విస్మరించి, స్వాతంత్ర్యాన్నే కించపరుస్తారా!

అవును, మీరు రాజుల కాలంనాటి బానిస భావాల వారసులు. నేటి ఆధునిక ప్రజాస్వామిక విలువలంటే చిర్రెత్తుకొస్తారు. మనుధర్మం తప్ప రాజ్యాంగమంటే మీకు ద్వేషం. మొన్న మొన్నటి వరకూ మన మూడు రంగుల జెండాను కూడా ఎగరేయడానికి పూనుకోలేదు కదా! ఎందుకెగరేస్తారులే! అసలు స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొంటే కదా! కాదు కాదు, ఆ పోరాటానికి వ్యతిరేకంగా బ్రిటిష్ వారికి వంతపాడిన వారసులు మీరనే విషయం ఈ సందర్భంగా గుర్తుచేసుకుంటున్నాం. పోరాడటం, త్యాగం చేయటం మీకు గిట్టని విషయం. ఒక్కసారి చరిత్రను చూడండి. లక్షలాది మంది ప్రజలు కుల, మత, ప్రాంత భేదాలేవీ లేక ఐక్యంగా పోరాడి పొందిన ఫలితాన్నే ఈ భగవత్, వారి వారసులూ అనుభవిస్తున్నారు. చరిత్రనూ తొక్కేయాలని చూస్తున్నారు. భిన్నమతాల వారు వీరులుగా పోరాడి మనకు స్వాతంత్ర్యాన్ని ఇచ్చిపోయారు. మీరేమో మతతత్వ కళ్లతో చూసి మాట్లాడుతున్నారు. పాశ్చాత్య దేశాల ఫాసిస్టు ఉద్యమాల నుండి ప్రేరణ పొందిన సంఘ్ సేవకులు ప్రజాస్వామ్యాన్నీ, స్వేచ్ఛను భరించడం కష్టంగానే ఉంటుంది మరి! స్వేచ్ఛ కోసం జరిగిన సమరంలో అసలు పాల్గొనని వారి మాటలు ఇంతకన్నా గొప్పగా ఏం ఉంటాయి. చెప్పుకోవటానికి సచ్చరిత్రే లేనివాళ్లు హీనులుగా మిగిలిపోకతప్పదు.

మోహన్ భగవత్ మాటలు తేలికగా తీసుకుంటే మోసపోతాము. అవి వారి భవిష్యత్ ఆచరణలో భాగంగా చెప్పిన మాటలు. మన రాజ్యాంగాన్ని, దాని విలువలను పక్కనపెట్టి సనాతన ధర్మం పేర మనుధర్మాన్ని తీసుకురావాలనే ప్రయత్నంలోంచి వచ్చిన మాటలవి. దేశభక్తి గురించి పెద్ద పెద్ద మాటలు చెప్పే వీళ్ల అసలు దేశభక్తి ఇది. దేశం కోసం ప్రాణాలర్పించిన వారిని కించపరచడం, దేశ స్వాతంత్ర్యాన్ని గుర్తించ నిరాకరించడం వీరి నైజం. ప్రజలు ఇలాంటి వారిపట్ల అప్రమత్తంగా ఉండాలి. చైతన్యంతో తిప్పికొట్టాలి

# రైతు కూలీలకు సర్కార్ శుభవార్త..
# 10 లక్షల మందికి ఆత్మీయ భరోసా..!!






తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి, కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

**ప్రజా స్వేచ్ఛ ఎల్బీనగర్**

భూమి లేని కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా స్కీమ్ తో కాంగ్రెస్ ప్రభుత్వం భరోసా కల్పించనుంది. ఈ స్కీమ్ ను జనవరి 26 నుంచి ప్రారంభించనుండగా..

ఏడాదికి రెండు విడతల్లో రూ. 12వేలు జమ చేయనున్నది. ఈ స్కీమ్ కు సంబంధించి ప్రభుత్వం కసరత్తు చేస్తుండగా.. లబ్ధిదారుల ఎంపిక కొలిక్కి వచ్చినట్లు తెలిసింది. సుమారు పది లక్షల కుటుంబాలను ప్రభుత్వం అర్హులుగా గుర్తించినట్లు సమాచారం. వ్యవసాయ భూమి లేకుండా, ఉపాధి హామీ జాబ్ కార్డు కలిగి ఉన్న వారు ఈ స్కీమ్ కు ఎలిజిబుల్ గా ప్రభుత్వం నిర్ణయించింది. అంతేకాకుండా ఉపాధి హామీలో సంవత్సరానికి కనీసం 20 రోజులు పని చేసి ఉండాలనే నిబంధన పెట్టింది. అందుకు అనుగుణంగా లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నది. అర్హులను గుర్తించే బాధ్యతను పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు అప్పగించింది.

**10 లక్షల మంది లబ్ధిదారులు!**

ఉపాధి హామీ గణాంకాల ప్రకారం రాష్ట్రంలో 53.07 లక్షల జాబ్ కార్డులు ఉన్నాయి. ఇందులో 1.10 కోట్ల మంది సభ్యులుగా ఉన్నారు. వీరిలో 29 లక్షల మంది జాబ్ కార్డుదారులకు ఎలాంటి భూమి లేదని గుర్తించారు. ఇందులోనూ చాలా కుటుంబాలు ఏడాదిలో ఒక రోజు నుంచి పది రోజులు మాత్రమే పని చేసినట్లు గుర్తించారు. కనీసం 20 రోజులు పని చేసి ఉండాలనే నిబంధనను అమలు చేస్తామని ఇటీవల నిర్వహించిన కలెక్టర్ల కాన్ఫరెన్స్ లో సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. 20 రోజులు ప్రామాణికంతో రాష్ట్రంలో 10 లక్షల కుటుంబాలు ఉన్నట్లు గుర్తించినట్లు సమాచారం. వీరికి ప్రతి పంట సీజన్ కు రూ. 6 వేలు చొప్పున ఇస్తే.. రూ. 600 కోట్ల వ్యయం అవుతుందని అంచనా వేసినట్లు తెలిసింది.

**కూలీతో సమానంగా..**

భూమి లేని నిరుపేదల కోసం 2005లో అప్పట్లో కేంద్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఉపాధి హామీ స్కీమ్ ను తీసుకువచ్చింది. కోట్లాది మంది ఉపాధికి భరోసా కల్పించింది. ఇప్పుడు రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆ ఉపాధి హామీ జాబ్ కార్డు కలిగి ఉన్న కుటుంబాలకు ఆత్మీయా భరోసా స్కీమ్ ద్వారా ఏడాదికి రూ. 12 వేలు అందజేయనున్నది. ఈ పథకం వ్యవసాయ కూలీలు పొందే మొత్తం.. ఉపాధి హామీ పనులకు హాజరవుతున్న పని దినాలతో సమానంగా ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఉపాధి హామీలో రోజుకు గరిష్టంగా రూ.230 వరకు చెల్లిస్తారు. అయితే కూలీలు సగటుగా రూ.200 పొందుతున్నారు. గరిష్ఠంగా 100 రోజులు పనిచేయడానికి అవకాశం ఉంటుంది. ఈ లెక్కన వారికి రూ. 20 వేలు వస్తాయి. ఇలా వంద రోజుల పనిచేసిన వారు గతేడాది 1.34 లక్షల జాబ్ కార్డుదారులు మాత్రమే ఉన్నారు. దీంతో వంద రోజులు పనికి వచ్చే వారు తక్కువనే చెప్పవచ్చు. ఈ నేపథ్యంలో సగటున వచ్చే కూలీ మొత్తాన్ని లెక్కిస్తే ప్రభుత్వం ఇచ్చే రూ.12 వేలకు కొంచెం అటూ ఇటుగానే ఉంటుందని అధికారులు లెక్కలు వేశారు.

## ఇండ్ల స్థలాలు కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి





**గద్వాల జిల్లా బ్యూరో, ప్రజా స్వేచ్ఛ**

గత ప్రభుత్వ హయాంలో పేదలకు ఇచ్చిన ప్రభుత్వ స్థలాలను కబ్జా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుని, లబ్ధిదారులకు ఇచ్చిన ప్లాట్లను తిరిగి ఇవ్వాలని సోమవారం ఉలిగేపల్లి గ్రామ ప్రజలు జిల్లా కలెక్టర్ బిఎం సంతోష్ కు, జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ టి.శ్రీనివాస్ రావులకు విన్నతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ.. మల్దకల్ మండలం ఉలిగేపల్లి గల సర్వే నంబర్ 102, 103 లో సుమారు 85 మంది నిరుపేదలకు 1995 వ సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం ఇండ్ల స్థలాలు పంపిణీ చేసిందన్నారు. ఉలిగేపల్లి గ్రామానికి చెందిన తిమ్మయ్య అనే వ్యక్తి తనకు ఇచ్చిన ప్లాట్లలో ఇంటి నిర్మాణం చేసుకున్నాడు. కాగా లబ్దిదారులకు ఇచ్చిన ఇండ్ల స్థలాలను కబ్జా చేసుకుని అక్రమంగా ఇంటి నిర్మాణం చేపడుతున్నాడని, లబ్దిదారులు ఇంటి నిర్మాణం చేపట్టొద్దని వారించగా బెదిరింపు చర్యలకు పాల్పడుతున్నాడని ఆరోపించారు. అంతే కాకుండా ఇప్పటికే 10 ప్లాట్లను ఆక్రమించుకొని పశువుల దొడ్డి ఏర్పటు చేసుకున్నాడన్నారు. అక్రమ నిర్మాణాలను నిలిపివేసి నిజమైన పట్టాదారులకు ప్లాట్లు అందజేయాలని జిల్లా ఉన్నతాధికారులను కోరినట్లు వారు తెలిపారు. కబ్జాదారుల నుండి ప్రభుత్వ స్థలాలను కాపాడి కబ్జాకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ లకు ఫిర్యాదు చేసినట్లు లబ్దిదారులు వెల్లడించారు.

## చింతరేవుల ఆంజనేయ స్వామి బ్రహ్మోత్సవాలు విజయవంతం చేద్దాం



**గద్వాల జిల్లా బ్యూరో, జనవరి 20 ప్రజా స్వేచ్ఛ**

ఫిబ్రవరి 1 నుంచి ప్రారంభం కానున్న ధరూర్ మండలం పెద్ద చింతరేవుల గ్రామంలో వెలసిన శ్రీ ఆంజనేయ స్వామి బ్రహ్మోత్సవాలను భక్తులు విజయవంతం చేయాలని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శ్రీ ఆంజనేయ స్వామి బ్రహ్మోత్సవాల గోడపత్రికలను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఫిబ్రవరిలో నిర్వహించు బ్రహ్మోత్సవాలకు ఇప్పటి నుంచే ప్రణాళికబద్ధంగా పనులను ప్రారంభించాలన్నారు. ఆయా శాఖల వారు తమకు అప్పగించిన పనులను సమన్వయంతో పూర్తి చేయాలన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ఆలయ ధర్మకర్త సి.గిరిరావు మాట్లాడుతూ.. ఫిబ్రవరి 1 నుంచి ఫిబ్రవరి 7 వరకు నిర్వహించు ఈ బ్రహ్మోత్సవాల్లో స్వామి వారికి అంకురార్పణ ధ్వజారోహణం, తెప్పోత్సవం, పల్లకిసేవ, రథోత్సవం, అలంకరణలు, అవభృత స్నానము, మధ్వనవమి,పల్లకి సేవ, స్వస్తివచనము తదితర కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త గిరిరావు, నాయకలు ప్రభాకర్ గౌడ్, కోటి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## దుబ్బాక నియోజకవర్గంలో సిసి రోడ్డు లేని పల్లెలుగా తీర్చిదిద్దడమే నా లక్ష్యం

–దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి



**దుబ్బాక: జనవరి 20, ప్రజా స్వేచ్ఛ**

తొగుట మండలంలోని పలు వివిధ గ్రామాలలో చందాపూర్, పెద్ద మాసంపల్లి,బండారుపల్లి, ఘనపూర్, జప్తి లింగారెడ్డిపల్లి, మొత్తం 67 లక్షల ఎన్ఆర్ జి ఎస్ నిధులతో దుబ్బాక నియోజకవర్గం సిసి రోడ్లు పనులను కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గం లోని సీసీ రోడ్డు లేని పల్లెలుగా తీర్చిదిద్దరమే మా లక్ష్యమని తెలియజేశారు ఇట్టి కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు జిల్లా నాయకులు సీనియర్ నాయకులు గ్రామ అధ్యక్షులు కార్యకర్తలు ఎం ఎస్ యు ఐ అధ్యక్షులు ఉపాధ్యక్షులు గ్రామస్తులుతదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ వార్డుల అభివృద్ధిపై దృష్టి

–ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు
–31వ వార్డులో సీసీ రోడ్డుకు శంకుస్థాపన

**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో/జనవరి 20 ప్రజా స్వేచ్ఛ**

మున్సిపల్ వార్డుల అభివృద్ధిపై ప్రధానంగా ఫోకస్ పెట్టినట్లు స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. మున్సిపల్ పరిధిలోని రైటర్ బస్తి గొల్లగూడెం ఏరియాలో సోమవారం 20 లక్షల రూపాయలతో చేపట్టబోయి సిసి రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైటర్ బస్తి గొల్లగూడెం వార్డును అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా, వార్డు కౌన్సిలర్ కోలాపురి ధర్మరాజు, సిపిఐ నాయకులు ఆటో శ్రీను, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# గ్రంధాలయ అభివృద్ధికి కృషి చేస్తా

**-షాద్ నగర్ గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మను కె. మదన్ మోహన్ రెడ్డి**



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జనవరి 20 ప్రజా స్వేచ్ఛ**
షాద్ నగర్ గ్రెడ్ 1 గ్రంధాలయ శాఖ అభివృద్ధికి తన శక్తివంచన లేకుండా కృషి చేస్తానని గ్రంథాల అభివృద్ధి కమిటీ నూతన చైర్మన్ కే మదన్మోహన్ రెడ్డి స్పష్టం చేశారు. స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో ప్రమాణ స్వీకారోత్సవ సభకు జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్సీ కోదండరామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయాల అభివృద్ధి చైర్మన్ మధుసూదన్ రెడ్డి నూతన కమిటీకి ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం చైర్మన్ కే. మదన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. గ్రంధాలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. గ్రంధాలయ అభివృద్ధి కోసం ఈ ప్రాంతంలో ప్రతి మండలంలో రెండు గ్రామీణ గ్రంధాలయాలు ఏర్పాటు చేసే విధంగా చూస్తామని అన్నారు. గ్రంధాలయాన్ని డిజిటలైజేషన్ చేస్తానని హామీ ఇచ్చిన జిల్లా చైర్మన్ మధుసూదన్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గ్రంధాల అభివృద్ధి కోసం మంత్రి జూపల్లి కృష్ణారావు రూ. 5 లక్షల కేటాయించడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. అదేవిధంగా డాక్టర్ రామకృష్ణ రూ.లక్ష గ్రంథాల అభివృద్ధికి ఇవ్వడం సంతోషకరమైన విషయమని అన్నారు. గ్రంథాలయం భవనం పైన పిల్లర్లు ఉన్నాయని అది హాలుగా మారిస్తే ఎన్నో విధాలుగా ఉపయోగపడుతుందని ఈ సందర్భంగా చెప్పారు. గ్రంధాలయ కమిటీ ప్రమాణ స్వీకారానికి విచ్చేసిన మంత్రి జూపల్లి, ఎమ్మెల్సీ కోదండరామిరెడ్డి, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి తదితరులకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమం కోసం వచ్చిన ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, సామాజికవేత్తలు, కాంగ్రెస్ కార్యకర్తలు అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. అదేవిధంగా తనకు చైర్మన్ పదవి రావడానికి ముఖ్యకారకులైన మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

# పటిష్ట డ్రైనేజీ వ్యవస్థను ప్రజలకు అందుబాటులోకి తెస్తా

**-డ్రైనేజీ పనుల శంకుస్థాపనలో పిఎసి చైర్మన్ గాంధీ**



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జనవరి 20ప్రజా స్వేచ్ఛ**
శేరిలింగంపల్లి నియోజకవర్గంలో పటిష్ట డ్రైనేజీ వ్యవస్థను ప్రజలకు అందుబాటులోకి తెస్తానని పిఎసి చైర్మన్ అరెకపూడి గాంధీ అన్నారు. సోమవారం చందానగర్ డివిజన్ పరిధిలోని విశ్వేశరయ్య కాలనీ, కేఎస్ ఆర్ ఎనక్లేవ్ కాలనీలలో రూ. 1.35 కోట్ల అంచనా వ్యయంతో నూతనంగా చేపట్టబోయే భూగర్భ డ్రైనేజి పైప్ లైన్ నిర్మాణ పనులకు కార్పొరేటర్లు మంజుల రఘునాథ్ రెడ్డి, రాగం నాగేందర్ యాదవ్, జలమండలి అధికారులతో కలిసి ఆయన పాల్గొని శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ.. భూగర్భ డ్రైనేజి సమస్య పరిష్కారమే ధ్యేయంగా ముందుకు వెళుతున్నామని, పలు కాలనీలలో ప్రజల నుండి వచ్చిన వినతి మేరకు, తమ దృష్టికి వచ్చిన సమస్యలను పరిగణలోకి తీసుకొని ప్రత్యేక చొరవతో శంకుస్థాపన చేసుకోవడం చాలా సంతోషకరంగా ఉందన్నారు. అత్యవసరం ఉన్న చోట, నిత్యం పొంగుతున్న ప్రాంతలలో ప్రథమ ప్రాధాన్యతగా పనులు పూర్తి చేస్తామని వివరించారు. ఏ చిన్న సమస్య అయిన తన దృష్టికి వచ్చిన తప్పకుండా పరిష్కరిస్తామని, కాలనీలలో మౌలిక వసతుల కల్పనకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తూ, కాలనీలను అన్ని రంగాలలో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్తూ సమస్య రహిత ఆదర్శవంతమైన కాలనీలుగా తీర్చిదిద్దడమే ప్రథమ లక్ష్యం అన్నారు. ఎన్నో ఏండ్ల సమస్య నేటితో తిరునని, నిత్యం పొంగుతుండటం వల్ల కాలనీ వాసులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వాటిని దృష్టిలో పెట్టుకొని పనులకు శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు. అదేవిధంగా మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేస్తామని అన్నారు. అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని, నాణ్యత విషయంలో ఎక్కడ రాజీ పడకూడదని, ప్రజలకు స్వచ్ఛమైన, చక్కటి ఆహ్లాదకరమైన వాతావరణం కలిపిస్తామని చెప్పారు. పనుల్లో జాప్యం లేకుండా త్వరిత గతిన పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జలమండలి అధికారులు డీజీఎం వెంకటేశ్వర్లు, మేనేజర్ సుబ్రమణ్యం, నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రోడ్ల వ్యవస్థ పటిష్టానికి ప్రత్యేక చొరవ





**సీసీ రోడ్ల నిర్మాణం పనుల శంకుస్థాపనలో పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ**



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జనవరి 20 ప్రజా స్వేచ్ఛ**
శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలో రోడ్ల పటిష్టతకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని పీఏసీ చైర్మెన్ అరెకపూడి గాంధీ అన్నారు. సోమవారం శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని శిల్ప గార్డెన్స్, క్రాంతి వనం, కేఎస్ ఆర్ ప్రైడ్ కాలనీలలో రూ. 98 లక్షల రూపాయల అంచనా వ్యయంతో నూతనంగా చేపట్టబోయే సీసీ రోడ్ల నిర్మాణం పనులకు కార్పొరేటర్లు రాగం నాగేందర్ యాదవ్, ఉప్పలపాటి శ్రీకాంత్ తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ.. ప్రజల సంక్షేమం, శేరిలింగంపల్లి నియోజకవర్గం, కాలనీల అభివృద్దే ధ్యేయంగా ప్రజల సౌకర్యార్థం రూ. 98 లక్షలతో సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన చేసుకోవడం జరిగిందన్నారు. మౌళిక వసతుల కల్పనకు పెద్ద పీట వేస్తానని అన్నారు. సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తున్నామని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకంలో శేరిలింగంపల్లి నియోకజకర్గంను అన్ని రంగాలలో అభివృద్ధి చేసి ఆదర్శవంతమైన, అగ్రగామి నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని తెలిపారు. అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని, నాణ్యత విషయంలో ఎక్కడ రాజీ పడకూడదని సూచించారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తానని చెప్పారు. పనుల్లో జాప్యం లేకుండా త్వరిత గతిన పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు, కాలనీల అసోసియేషన్ సభ్యులు, మహిళలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కంది కొనుగోలు కేంద్రాలను వెంటనే ఏర్పాటు చేయాలి



**గద్వాల జిల్లా బ్యూరో, జనవరి 20ప్రజా స్వేచ్ఛ**
గద్వాల జిల్లా వ్యాప్తంగా రైతులు పండించిన కంది పంటను కొనుగోలు చేసేందుకు వెంటనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని తన చాంబర్లో కందుల కొనుగోలుపై ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 2024-25 వానకాలం సీజన్లో రైతులు పండించిన కందులను మార్క్ ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని సూచించారు. జిల్లాలోని ఆలంపూర్, వడ్డేపల్లి, ఐజ, పుటాన్ దొడ్డి, గద్వాల మార్కెట్లలో కందుల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు. జిల్లాలో ముందుగా బుధవారం అలంపూర్, వడ్డేపల్లి మార్కెట్లలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కందులను కొనుగోలు చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర క్వింటాలకు రూ. 7,550 చొప్పున కొనుగోలు చేయాలని సూచించారు. రైతులు నాణ్యమైన కందులను కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సక్రియ నాయక్, మార్క్ ఫెడ్ డిఎం గౌరీ నగేష్, జిల్లా కో-ఆపరేటివ్ అధికారి శ్రీనివాస్, ఎస్ డబ్ల్యూ సి మేనేజర్ ఉపేందర్ వివిధ శాఖల సహాయ అధికారులు పాల్గొన్నారు.


# బన్సల్ కార్పొరేట్ కళాశాలపై చర్యలు తీసుకొని సీజ్ చేసి క్రిమినల్ కేసులు నమోదు చేయాలి

**ఐక్య విద్యార్థి సంఘాల ఆందోళన**



**మంచిర్యాల జిల్లా, జనవరి 20 ప్రజా స్వేచ్ఛ**
నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ సురేష్ కు ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. అనంతరం విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ... మంచిర్యాల పట్టణంలోని శ్రీనివాస్ గార్డెన్ దగ్గర ఓ అద్దె భవనంలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి అనుమతులు లేకుండా నూతనంగా బన్సల్ కార్పొరేట్ కళాశాల డే అండ్ రెసిడెన్షియల్ ఏసీ క్యాంపస్ ను ఏర్పాటు చేసి వారికి ఇష్టం వచ్చినట్లుగా పదిమంది టెలీకాలర్స్ ను పెట్టుకొని తమ దందాను కొనసాగిస్తున్నారన్నారు. మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా ఉన్నటువంటి ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థుల సమాచారం సేకరించి విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు ఫోన్ చేస్తూ వారిని మభ్యపెడుతూ మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా పిఆర్ఓలను పెట్టుకొని అడ్మిషన్లకు తిప్పుతు ఐఐటీ, నీట్ ల పేరుతో లక్షల్లో ఫీజులు దండుకోవడానికి సిద్ధమయ్యారన్నారు. అంతేకాకుండా మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా ఫ్లెక్సీలు పెట్టడం జరిగిందన్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న కళాశాలకు అనుమతులు ఇవ్వకుండా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని సీజ్ చేసి క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు జుమ్మిడి గోపాల్, బచ్చలి ప్రవీణ్ కుమార్, రేగుంట క్రాంతి కుమార్, షైక్ సల్మాన్ పాషా, జాగిరి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# పెచ్చులు పగిలిన మెట్రో రైలు దిమ్మలు



**దిల్ సుఖ్ నగర్, జనవరి 20 ప్రజా స్వేచ్ఛ**
మహానగరానికి తలమాణికం అని చెప్పుకునే మెట్రో రైలు... రైలు పట్టాలకు అడ్డుగా పెట్టిన దిమ్మలు పెచ్చులుడిన ఘటన....దిల్ సుఖ్ నగర్ నుండి చైతన్యపురి వెళ్లే మెట్రో రైలు పిల్లర్ నెంబర్ ఏ 1547 ఏ 1548 మధ్యలో మెట్రో రైలు దిమ్మలు పెచ్చులు ఊడి పిల్లర్ల కింద ప్రయాణించే వాహనదారులకు భయం కలిగిస్తుంది.. ఇంకొక పెచ్చు ఊడి కింద ఎవరి మీదనైనా పడితే ప్రమాదం జరిగే అవకాశం ఉందని, మెట్రో రైలు యాజమాన్యం త్వరగా పెచ్చులు మళ్ళీ ఉడిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్న వాహనదారులు.

# బిజినెస్

## అందరి చూపు ట్రంప్‌పైనే.. ఫ్లాట్‌గా బంగారం.. స్వల్పంగా తగ్గిన వెండి..!



అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్ ప్రమాణ స్వీకారంపై ఇన్వెస్టర్లందరూ దృష్టిని కేంద్రీకరించారు. ఫలితంగా దేశ రాజధాని ఢిల్లీలో సోమవారం 99.9శాతం స్వచ్ఛత గల బంగారం తులం ధర రూ.82,000 వద్ద ఫ్లాట్‌గా ఉంది. శుక్రవారం బులియన్ మార్కెట్‌లో రూ.700 వృద్ధితో రూ.82,000లకు చేరుకుంది. 99.5శాతం స్వచ్ఛత గల బంగారం తులం ధర రూ.81,600 వద్ద ఫ్లాట్‌గా కొనసాగింది. గతేడాది అక్టోబర్ 31న 99.9 శాతం స్వచ్ఛత గల బంగారం తులం ధర రూ.82,400లతో జీవిత కాల గరిష్టాన్ని తాకింది. దాంతోపాటు 99.5శాతం స్వచ్ఛత గల బంగారం పది గ్రాములు ధర రూ.82 వేలు పలికింది. మరోవైపు కిలో వెండి ధర రూ.500 పతనమై రూ.93,000 వద్ద నిలిచింది. శుక్రవారం కిలో వెండి ధర రూ.93,500వద్ద ముగిసింది. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసీఎక్స్)లో ఫిబ్రవరి డెలివరీ గోల్డ్ కాంట్రాక్ట్స్ తులం బంగారం ధర రూ.62 తగ్గి రూ.78,961లకు చేరుకుంది. మరోవైపు కిలో వెండి మార్చి కాంట్రాక్స్ ధర రూ.202 పతనమై రూ.91,400 వద్ద స్థిర పడింది.అంతర్జాతీయ మార్కెట్‌లో కామెక్స్ గోల్డ్ ఫ్యూచర్స్‌లో ఔన్స్ బంగారం ధర 0.09 శాతం తగ్గి 2,746.30 డాలర్లు పలికింది. అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ ప్రమాణం చేయనున్న నేపథ్యంలో కామెక్స్ గోల్డ్ ఫ్యూచర్స్‌లో బంగారం ధర 2750 డాలర్ల దిగువన ట్రేడయిందని కోటక్ సెక్యూరిటీస్ పేర్కొంది. మరోవైపు, సిల్వర్ కామెక్స్ ఫ్యూచర్స్‌లో ఔన్స్ వెండి ధర 0.13శాతం పతనంతో 31.10 డాలర్లకు చేరుకుంది. అంతర్జాతీయ రాజకీయ, ఆర్థిక అనిశ్చితి నేపథ్యంలో జనవరి నెలలో బంగారం ధర మూడు శాతానికి పైగా, వెండి ఏడు శాతానికి పైగా పెరిగింది. డాలర్ ఇండెక్స్ బలహీన పడినా, యూఎస్ ఫెడ్ రిజర్వ్ కీలక వడ్డీరేట్లు తగ్గించినా బంగారం ధరలు పెరిగే అవకాశాలు ఉన్నాయి.

## ఫ్లెక్స్ ఫ్యుయల్ వర్షన్ క్రెటా.. ఆవిష్కరించిన హ్యుండాయ్.. ఇవీ డిటెయిల్స్..!




ప్రముఖ దక్షిణ కొరియా ఆటోమొబైల్ దిగ్గజం హ్యుండాయ్ దేశీయ మార్కెట్లో ఫ్లెక్స్ ఫ్యుయల్ కారు తెచ్చేందుకు సన్నాహాలు చేస్తోంది. దేశ రాజధాని ఢిల్లీలో జరుగుతున్న భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పో లో సోమవారం హ్యుండాయ్ మోటార్ ఇండియా ఎండీ యున్‌సూకిమ్, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ కం హోల్‌టైం డైరెక్టర్ తరుణ్ గార్గ్ ప్రొటోటైప్ హ్యుండాయ్ క్రెటా ఫ్లెక్స్ ఫ్యుయల్ కారును ఆవిష్కరించారు. కారు 100శాతం పెట్రోల్ (ఈ0), వందశాతం ఇథనాల్ (ఈ100)లతో పని చేస్తుంది. కర్బన ఉద్గారాల తగ్గింపుతోపాటు మెరుగైన పవర్, టార్క్ డెలివరీని బలోపేతం చేస్తాయి ఇథనాల్ పవర్డ్ వెహికల్స్. ప్రభుత్వ ఇన్సెంటివ్‌ల సాయంతో ఫ్లెక్స్ ఫ్యుయల్ కార్ల ధరలు తగ్గుముఖం పడతాయి. ప్రస్తుతం హ్యుండాయ్ క్రెటా కారు పెట్రోల్, టర్బో-పెట్రోల్, డీజిల్, ఎలక్ట్రిక్ ఆప్షన్లలో అందుబాటులో ఉంటుంది. భారత్ మొబిలిటీ ఎక్స్ పో 2025లోనే హ్యుండాయ్ తన క్రెటా ఎలక్ట్రిక్ కారు ఆవిష్కరించింది. దీని ధర రూ.17.99 లక్షలు (ఎక్స్ షోరూమ్) పలుకుతుంది. క్రెటా ఎలక్ట్రిక్ రెండు బ్యాటరీ ఆప్షన్లు - 42 కిలోవాట్ల బ్యాటరీ ప్యాక్‌తో 99కిలోవాట్ల మోటార్‌తో వస్తోంది. ఈ బ్యాటరీ సింగిల్ చార్జింగ్‌తో 390 కి.మీ దూరం ప్రయాణిస్తుంది. ఇక 51.4కిలోవాట్ల బ్యాటరీ ప్యాక్‌తో 126కిలోవాట్ల మోటార్‌తో వస్తున్నది. సింగిల్ చార్జింగ్‌తో 473 కి.మీ దూరం ప్రయాణిస్తుంది. టాప్ వేరియంట్ కేవలం 7.9 సెకన్లలో 100 కి.మీ వేగం అందుకుంటుంది. హ్యుండాయ్ (ఐసీఈ) క్రెటా కారు మూడు ఇంజిన్ ఆప్షన్లలో లభిస్తుంది. 1.5- లీటర్ల పెట్రోల్ ఇంజిన్ (113బీహెచ్‌పీ, 144 ఎన్ఎం టార్క్), 1.5-లీటర్ల డీజిల్ ఇంజిన్ (114బీహెచ్‌పీ, 250 ఎన్ఎం టార్క్),1.5-లీటర్ల టర్బో పెట్రోల్ ఇంజిన్ (158బీహెచ్‌పీ, 253 ఎన్ఎం టార్క్) వెలువరిస్తుంది. ఈ కారు పెట్రోల్ ఇంజిన్ వేరియంట్ 6-స్పీడ్ మాన్యువల్, సీవీటీ ట్రాన్స్‌మిషన్, డీజిల్ వేరియంట్ 6-స్పీడ్ టార్క్ కన్వర్టర్, టర్బో పెట్రోల్ వేరియంట్ 7- స్పీడ్ డీసీటీ కన్వర్టర్ ట్రాన్స్‌మిషన్ ఆప్షన్లలో అందుబాటులో ఉంటుంది.

## లగ్జరీ.. ప్రీమియం జీవనానికి హైదరాబాదీల మొగ్గు.. ఏడు శాతం పెరిగిన ఇండ్ల విక్రయాలు..!

తెలంగాణ రాజధాని హైదరాబాద్ పరిధిలో సొంతిండ్లకు గిరాకీ పెరుగుతోంది. అందుకే 2023తో పోలిస్తే గతేడాది ఇండ్ల విక్రయాలు ఏడు శాతం వృద్ధి చెందాయని ప్రముఖ రియాల్టీ కన్సల్టెంట్ సంస్థ నైట్ ఫ్రాంక్ అంచనా వేసింది. 2023లో 71,912 ఇండ్ల అమ్మకాలు జరిగితే, 2024లో ఏడు శాతం పెరిగి 76,613 యూనిట్ల విక్రయాలు జరిగాయి. మొత్తం ఇండ్ల విక్రయాల విలువ 23శాతం పెరిగింది. 2023లో 38,395 కోట్ల విలువైన ఇండ్ల విక్రయాలు జరిగితే, 2024లో 47,173 కోట్లకు చేరుకున్నాయి. మొత్తం ఇండ్ల విక్రయాల్లో 90 శాతం రెసిడెన్షియల్ సెగ్మెంట్‌దే ఆధిపత్యం. హైదరాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాలు హైదరాబాద్ మార్కెట్ పరిధిలోకి వస్తాయి. ప్రైమరీ,



సెకండరీ రియల్ ఎస్టేట్ మార్కెట్లలో ఇండ్ల విక్రయ లావాదేవీలు జత కలిసి ఉన్నాయి.గత ఏడాది కాలంలో హైదరాబాద్ మార్కెట్ ప్రగతి దిశగా అడుగులేస్తున్నది. సొంతిండ్లకు డిమాండ్ సుస్థిరంగా కొనసాగుతున్నదని నైట్ ఫ్రాంక్ ఇండియా చైర్మన్ శిశిర్ బైజాల్ చెప్పారు. అంతే కాదు.. ఇండ్ల కొనుగోలు దారుల ప్రాధాన్యాల్లోనూ చెప్పుకోదగిన మార్పు కనిపిస్తోంది. రూ.50 లక్షల్లోపు ధర గల ఇండ్ల విక్రయాలు 60శాతం ఉంటే, 2023లో అది 68 శాతంగా ఉంది. ఇక రూ.50 లక్షల పై చిలుకు ధర గల ఇండ్ల రిజిస్ట్రేషన్లు 2023తో పోలిస్తే 2024లో 40 శాతానికి వృద్ధి చెందాయి. 2022తో పోలిస్తే 2023లో రూ.50 లక్షలపై చిలుకు ఇండ్ల విక్రయాలు 32శాతం పుంజుకున్నాయి. బలమైన ఆర్థిక మూలాలు, ప్రీమియం, లగ్జరీ జీవనానికి హైదరాబాదీలు ప్రాధాన్యం ఇస్తున్నారని శిశిర్ బైజాల్ పేర్కొన్నారు. రియల్ ఎస్టేట్ డెవలపర్లు సైతం మార్కెట్ అవసరాలకు అనుగుణంగా కొత్త వెంచర్లు, ప్రాజెక్టులు ప్రారంభించేందుకు చురుగ్గా స్పందిస్తున్నారన్నారు.

## రంజీలో రోహిత్ శర్మ, యశస్వి జైస్వాల్.. జట్టును ప్రకటించిన ముంబై


భారత కెప్టెన్ రోహిత్ శర్మ రైజింగ్ స్టార్ యశస్వి జైస్వాల్.. ముంబై రంజీ జట్టుకు ఆడనున్నారు. రంజీ టోర్నీలో భాగంగా జవనరి 23 నుంచి జమ్మూకశ్మీర్‌తో జరగనున్న మ్యాచ్‌కు .. ముంబై క్రికెట్ సంఘం జట్టు సభ్యులను ప్రకటించింది. ఆ బృందంలో రోహిత్, జైస్వాల్ ఉన్నారు. అజింక్య రహానే సారథ్యంలో ముంబై జట్టు మ్యాచ్ ఆడనున్నది. రంజీ ట్రోఫీలో ఆడేందుకు ఆసక్తిగా ఉన్నట్లు ఇటీవల రోహిత్ పేర్కొన్న విషయం తెలిసిందే.ఇటీవల ఆస్ట్రేలియాతో ముగిసిన సిరీస్‌లో రోహిత్ సరైన రీతిలో పర్ఫార్మ్ చేయలేదు. దీంతో అతను చివరి టెస్టు నుంచి తప్పుకున్నాడు. అయితే శనివారం చాంపియన్స్ ట్రోఫీకి చెందిన జట్టును ప్రకటించారు. సీటీ టోర్నీ కోసం రోహిత్ పగ్గాలు చేపట్టనున్నాడు. ఆసీస్ టూర్‌లో పేలవ ప్రదర్శన కారణంగా.. ప్లేయర్లు స్వదేశీ క్రికెట్‌లో ఆడాలంటూ బీసీసీఐ ఓ నిబంధన కూడా పెట్టిన విషయం తెలిసిందే. గత ఆరేడేళ్ల నుంచి రెగ్యులర్‌గా టెస్టు క్రికెట్ ఆడడం వల్ల.. స్వదేశీ టోర్నీలో ఆడే అవకాశం లేకుండాపోయిందని ఇటీవల రోహిత్ పేర్కొన్నాడు.



ముంబై జట్టు:
అజింక్య రహానే(కెప్టెన్), రోహిత్ శర్మ, యశస్వి జైస్వాల్, ఆయుష్ మాత్రే, శ్రేయాస్ అయ్యర్, సిద్దేశ్ లాడ్, శివం దూబే, హార్దిక్ తామోర్(వికెట్ కీపర్), ఆకాశ్ ఆనంద్, తనుష్ కొటియాన్, షామ్స్ ములానీ, హిమాన్షు సింగ్, శార్దూల్ ఠాకూర్, మోహిత్ అవాస్తీ, సిల్వస్టర్ డిసౌజా, రోస్టన్ దయాస్, కర్ష్ కొఠారి.

## హార్దిక్ పాండ్యాతో హెడ్‌కోచ్ గంభీర్ చర్చ..! వైస్ కెప్టెన్సీ గురించేనా..?


కోల్‌కతా వేదికగా ఇంగ్లాండ్ తో టీమిండియా ఈ నెల 22న తొలి టీ20 మ్యాచ్‌లో తలపడనున్నది. ఈ మ్యాచ్ కోసం టీమిండియా ఆటగాళ్లు ఈడెన్ గార్డెన్స్‌లో ప్రాక్టీస్ చేస్తున్నారు. మరోవైపు భారత జట్టు హెడ్‌కోచ్ గౌతమ్ గంభీర్ , ఆల్ రౌండర్ హార్దిక్ ప్యాండా దాదాపు గంటసేపు ఇద్దరూ మాట్లాడుతూ కనిపించారు. ఇద్దరూ నెట్స్‌కు దూరంగా సుదీర్ఘంగా మాట్లాడుకున్నారు. చాంపియన్స్ ట్రోఫీ లో టీమిండియా వైస్ కెప్టెన్‌గా హార్దిక్ పాండ్యా పేరును హెడ్‌కోచ్ గంభీర్ సూచించినట్లు వార్తలు వచ్చాయి. ఈ సమయంలోనే ఇద్దరు మాట్లాడుకోవడం హాట్ టాపిక్‌గా మారింది. అయితే, వన్డే జట్టు వైస్ కెప్టెన్ బాధ్యతలను శుభ్‌మాన్ గిల్‌కు టీమ్ మేనేజ్‌మెంట్



అప్పగించింది.చాంపియన్స్ ట్రోఫీ కోసం భారత జట్టును శనివారం ప్రకటించిన విషయం తెలిసిందే. సెలక్షన్ కమిటీ దాదాపు మూడు గంటల పాటు సమావేశమైంది. భేటీలో జట్టు విషయంలో సెలెక్టర్ల మధ్య ఏ అంశంపై ఏకాభిప్రాయం కుదరలేదని ప్రచారం జరిగింది. 2023 వన్డే ప్రపంచకప్ తర్వాత హార్దిక్ టీ20 జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించాడు. గతేడాది సూర్యకుమార్ యాదవ్‌కు బాధ్యతలు ఇచ్చారు. ఇంగ్లాండ్‌తో జరిగిన టీ20 సిరీస్‌కు అక్షర్ పటేల్‌ను వైస్ కెప్టెన్‌గా నియమించారు. ఛాంపియన్స్ ట్రోఫీకి ఎంపిక కాని సంజు సామ్సన్‌తో కూడా గంభీర్ మాట్లాడడం కనిపించింది. టీ20 సిరీస్‌కు వికెట్ కీపర్‌గా ఎంపికైన శాంసన్.. ఛాంపియన్స్ ట్రోఫీకి ఎంపిక దాదాపు ఖాయమైందని.. కోచ్ గంభీర్ సైతం అతని వైపు మొగ్గు చూపినట్లుగా వార్తలు వచ్చాయి.

# స్పోర్ట్స్

## లక్నో సూపర్ జెయింట్స్ కెప్టెన్‌గా రిషబ్ పంత్.. ప్రకటించిన సంజీవ్ గొయెంకా



ఐపీఎల్‌లో లక్నో సూపర్ జెయింట్స్ కెప్టెన్‌గా భారత జట్టు స్టార్ వికెట్ కీపర్, బ్యాట్స్‌మెన్ రిషబ్ పంత్ నియామకమయ్యాడు. ఈ విషయాన్ని ఫ్రాంచైజీ ఓనర్ సంజీవ్ గొయెంకా వెల్లడించారు. రాబోయే ఐపీఎల్‌లో పంత్ అత్య విజయవంతమైన కెప్టెన్‌గా నిలుస్తాడని ఆశాభావం వ్యక్తం చేశారు గొయెంకా. ఇటీవల జెడ్డా వేదికగా జరిగిన ఐపీఎల్ మెగా వేలంలో లక్నో జట్టు రూ.27కోట్లు పోసి కొనుగోలు చేసిన విషయం తెలిసిందే. ఐపీఎల్-2025 సీజన్ ఈ ఏడాది మార్చి చివరి వారంలో మొదలుకానున్నది. ఈ సీజన్‌కు రిషబ్ పంత్‌ను జట్టు యాజమాన్యం నియమించింది. గత సీజన్ వరకు లక్నో జట్టు కెప్టెన్‌గా కేఎల్ రాహుల్ కొనసాగాడు. లక్నో కేఎల్ రాహుల్‌ను రిటైన్ చేసుకునేందుకు ఆసక్తి చూపలేదు. ఇక రిషబ్ పంత్ గతంలో ఢిల్లీ క్యాపిటల్స్ జట్టులో కొనసాగిన విషయం తెలిసిందే. రిషబ్ పంత్ ఢిల్లీకి 2016 నుంచి ప్రాతినిథ్యం వహిస్తూ వచ్చాడు. 110 మ్యాచ్‌ల్లో 35.31 సగటుతో 3,284 పరుగులు చేశాడు. ఇందులో ఒక సెంచరీ, 18 అర్ధ సెంచరీలు ఉన్నాయి. పంత్ 2021లో ఢిల్లీ జట్టుకు కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. అదే సీజన్‌లో జట్టును ప్లేఆఫ్ వరకు చేర్చాడు. %శూా% 2025 సీజన్ కోసం మెగా వేలానికి ముందు, లక్నో నికోలస్ పూరన్, మయాంక్ యాదవ్, రవి బిష్ణోయ్, మొహ్సిన్ ఖాన్, ఆయుష్ బడోనిని రిటైన్ చేసుకుంది. గత సీజన్ లక్నోకు ఏమాత్రం కలిసిరాలేదు. 14 మ్యాచ్‌ల్లో ఏడు విజయాలు, ఏడు ఓటములతో 14 పాయింట్లతో ఏడో స్థానంలో నిలిచింది.




# భారీ అంచనాలు పెంచుతున్న తండేల్

టాలీవుడ్ యాక్టర్ అక్కినేని నాగచైతన్య -సాయిపల్లవి కాంబోలో సినిమా వస్తుందంటే క్రేజ్ ఎలా ఉంటుందో తెలిసిందే. ఇప్పటికే లవ్ స్టోరీతో బాక్సాఫీస్‌ను షేక్ చేసిన ఈ స్టార్ యాక్టర్లు ప్రస్తుతం తండేల్‌లో నటిస్తున్నారు. రొమాంటిక్ డ్రామా నేపథ్యంలో వస్తోన్న ఈ చిత్రం చందూ మొండేటి డైరెక్షన్‌లో తెరకెక్కుతోంది. ఈ చిత్రాన్ని ఫిబ్రవరి 7న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేస్తున్నట్టు మేకర్స్ ఇప్పటికే ప్రకటించారు. ఈ మూవీ తెలుగు, తమిళం, హిందీ భాషల్లో విడుదల కానుంది. అయితే తాజాగా మరో క్రేజీ నిర్ణయాన్ని తీసుకున్నారన్న వార్త ఒకటి నెట్టింట హల్ చల్ చేస్తోంది. తండేల్ మలయాళం వెర్షన్‌ను రిలీజ్ చేయాలని ప్లాన్ చేస్తుండగా.. త్వరలోనే దీనిపై అధికారిక ప్రకటన కూడా ఉండబోతుందట. సాయిపల్లవికి మలయాళంలో సూపర్ క్రేజ్ ఉంటుందని తెలిసిందే. ఒకవేళ ఇదే నిజమైతే తండేల్ సినిమాకు మాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద వసూళ్లు పెరుగుతాయనడంలో ఎలాంటి సందేహం లేదు. తండేల్ నుంచి ఇప్పటికే లాంచ్ చేసిన బుజ్జి తల్లి సాంగ్‌కు మంచి స్పందన వస్తోంది. 2018లో గుజరాత్ జరిగిన వాస్తవ ఘటనల ఆధారంగా వస్తోన్న తండేల్ చిత్రాన్ని గీతాఆర్ట్స్‌పై అల్లు అరవింద్ సమర్పణలో బన్నీవాసు నిర్మిస్తున్నారు. ఈ మూవీకి అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. తండేల్ నాగచైతన్య-చందూ మొండేటి కాంబోలో రాబోతున్న మూడో సినిమా కావడంతో ఈ ప్రాజెక్టుపై అంచనాలు భారీగానే ఉన్నాయి.

# శివుడి పాత్రలో అక్షయ్‌కుమార్

## -ఆకట్టుకుంటున్న కన్నప్ప లుక్

ఫ్యామిలీ గొడవలతో సతమవుతున్న మంచు ఫ్యామిలీ.. మరోవైపు తమ కలల ప్రాజెక్ట్ కన్నప్పను పూర్తి చేసే పనిలో పడింది. మంచు కుటుంబం నుంచి వస్తున్న మోస్ట్ ప్రెస్టీజియస్ ప్రాజెక్ట్ కన్నప్ప. దాదాపు రూ.100 కోట్ల బడ్జెట్‌తో వస్తున్న ఈ సినిమాను కలెక్షన్ కింగ్ మంచు మోహన్ బాబు నిర్మిస్తుండగా.. మంచు విష్ణు కథానాయకుడిగా నటిస్తున్నాడు. హిస్టారికల్ కం మైథాలజీ బ్యాక్‌డ్రాప్‌లో వస్తున్న ఈ చిత్రంలో ప్రభాస్‌తో పాటు బాలీవుడ్, కోలీవుడ్ అగ్ర తారలు నటిస్తున్న విషయం తెలిసిందే. ఈ చిత్రానికి మహాభారతం సీరియల్ ఫేమ్ ముఖేష్‌కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నాడు. ఇప్పటికే ఈ మూవీ నుంచి మంచు మోహన్ బాబు, మంచు విష్ణులతో పాటు పలువురు అగ్ర కథానాయకుల ఫస్ట్ లుక్‌లను పంచుకున్న చిత్రబృందం తాజాగా ఈ సినిమా నుంచి బాలీవుడ్ నటుడు అక్షయ్ కుమార్ ఫస్ట్ లుక్‌ని విడుదల చేసింది. ఈ సినిమాలో అక్షయ్ కుమార్ పరమేశ్వరుడి పాత్రలో కనిపించబోతున్నట్లు ప్రకటించింది. ముల్లోకాలు ఏలే పరమేశ్వరుడు భక్తికి మాత్రం దాసుడు అంటూ అక్షయ్ శివుడి రూపంలో ఉన్న అక్షయ్ ఫస్ట్ లుక్‌ని పంచుకుంది.







# నా భార్యకు నా పాస్‌వర్డ్‌లు అన్నీ తెలుసు

టాలీవుడ్‌లో సక్సెస్ రేట్ ఎక్కువగా ఉన్న సీనియర్ హీరోల్లో టాప్‌లో ఉంటాడు వెంకటేశ్. తనదైన మ్యానరిజంతో వినోదాన్ని పంచే వెంకీ ఇటీవలే సంక్రాంతికి వస్తున్నాం సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చాడు. అనిల్ రావిపూడి డైరెక్షన్‌లో తెరకెక్కిన ఈ మూవీలో ఐశ్వర్యా రాజేశ్, మీనాక్షి చౌదరి ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటించాడు. భార్య, మాజీ ప్రియురాలి మధ్య చిక్కుకున్న భర్త పాత్రలో నటించాడు వెంకటేశ్. ఇందులో వెంకీ చెప్పే డైలాగ్స్ చాలా మంది ఫ్యామిలీ ఆడియెన్స్‌కు బాగా కనెక్ట్ అవుతున్నాయి. తాజాగా ఓ ఇంటర్వ్యూలో వెంకటేశ్‌ను ఆసక్తికర ప్రశ్న అడిగింది యాంకర్ సుమ. మీ భార్యకు మీ మొబైల్ పాస్‌వర్డ్‌లు, ఇతర పాస్‌వర్డ్‌లు తెలుసా..? అని వెంకీని అడిగింది సుమ. దీనికి వెంకీ ఏ మాత్రం తడబడకుండా నా భార్యకు నా మొబైల్‌తోపాటు అన్ని ఖాతాలో పాస్‌వర్డ్‌లు తెలుసు. ఈ విషయంలో నేను చాలా పారదర్శకంగా ఉంటా. ఆమెకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చేశానంటూ చెప్పుకొచ్చాడు. ఇప్పుడీ కామెంట్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి. సంక్రాంతి కానుకగా జనవరి 14న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదలైన ఈ చిత్రం సంక్రాంతి బ్లాక్ బస్టర్‌గా నిలిచింది. కేవలం 6 రోజుల్లోనే రూ.100 కోట్ల షేర్‌ను రాబట్టి వెంకీ కెరీర్‌లో నయా బెంచ్ మార్క్ క్రియేట్ చేసింది. అనిల్ రావిపూడి కెరీర్ మైల్ స్టోన్ సినిమాగా నిలవడమే కాకుండా.. కెరీర్‌లో సెకండ్ హయ్యెస్ట్ గ్రాసింగ్ ఫిల్మ్‌గా నిలిచింది. ఈ చిత్రంలో నరేశ్, పాపులర్ మరాఠీ యాక్టర్, యానిమల్ ఫేం ఉపేంద్ర లిమాయే, కోలీవుడ్ నటుడు వీటీవీ గణేశ్ కీలక పాత్రలు పోషించారు. ఈ మూవీని దిల్ రాజు సమర్పణలో శిరీష్ నిర్మించారు.



# మీనాక్షికి ఫస్ట్ క్రష్ అతడే

సంక్రాంతికి వస్తున్నాం' సినిమాతో హిట్టు అందుకొని వరుస హిట్లతో ఇండస్ట్రీలో దూసుకుపోతున్న స్టార్ హీరోయిన్ మీనాక్షి చౌదరి. అయితే తను ఇండస్ట్రీలో ఎంట్రీ ఇచినప్పటి నుండి ఎవరో ఒక హీరోతో డేటింగ్ లో ఉందని, ఇంకో హీరోతో పెళ్లి అని ఎదో ఒక పుకార్లు వినిపిస్తూనే ఉన్నాయి. ఇంతకీ మీనాక్షి లైఫ్ లో లవ్ ఉందా? ఆమెకు ఎవరంటే ఇష్టం? వీటిపై ఆమె ఏమన్నారు అంటే.. తనపై వస్తున్న రూమర్స్ ని ఖండిస్తూనే మీనాక్షి తన లవ్ లైఫ్ గురించి చెప్పేసింది. తాజాగా జరిగిన ఓ ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ.. " ప్రస్తుతం అయితే నా ఫోకస్ అంత సినిమాలపైనే ఉంది. స్కూల్ లేదా కాలేజీలో స్టూడెంట్స్ కు కచ్చితంగా టీచర్లపై క్రష్ ఉంటుంది. నాక్కూడా అలాంటిదే ఉంది. నేను 9వ తరగతి చదువుతున్నప్పుడు నా క్లాస్ లో ఓ టీచర్ అంటే చాలా ఇష్టం. టోటల్ క్లాస్ మొత్తం అతడ్ని ఇష్టపడేది. నాకైతే ఇంకా ఎక్కువ ఇష్టం. అదే నా ఫస్ట్ క్రష్ అండ్ లవ్." అంటూ తన ఫస్ట్ క్రష్ ని రివీల్ చేసింది. మాటలు కొనసాగిస్తూ.. " నాకు ఆ తర్వాత మళ్లీ ప్రేమలో పడేంత టైమ్ దొరకలేదు. మరీ ముఖ్యంగా మెడిసిన్ చదువు వల్ల ప్రేమకు పూర్తిగా దూరమయ్యాను. కాలేజీ లైఫ్ లో ఎలాంటి లవ్ లేదు. చదువుతోనే సరిపోయింది. పైగా మెడికల్ కాలేజీ కదా ఒత్తిడి చాలా ఎక్కువగా ఉండేది. ఎప్పుడూ చదువే. ఇండస్ట్రీకి వచ్చిన తర్వాత కూడా నేను ఎవరి ప్రేమలో పడలేదు. కెరీర్ పై మాత్రమే ఫోకస్ పెడుతూ వస్తున్నాను. ఇప్పుడిప్పుడే సెటిల్ అవుతున్నకాబట్టి ప్రేమ, పెళ్ళికి టైమ్ ఉంది. ప్రస్తుతానికి సినిమాలే నా లోకం" అంటూ ఫుల్ క్లారిటీ ఇచ్చేసింది.

Printed published and woned by Tarigolpula Lakshmi, mahender ,printers karshak Art Printers, Hyderabad and published by office 2-6-376, Jaipuri colony,Nogole village,Uppal mandal, district Ranga Reddy,Post GSI,500068-Telangana RNI NO.APTEL/2012/46853 . Email ID : Prajaswecha@gmail.com, website, www.Prajaswecha.com cell 9381910611, 79892 89492